# పంచగ్రంథము

పదకొండవ పాఠం

## నిర్గమకాండము యొక్క అవలోకనము

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీక్షలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# విషయ సూచిక


ఉపోద్ఘాతం .......... 1

ఆరంభ పరిగణలు .......... 1

గ్రంథకర్తృత్వము .......... 2

సందర్భము .......... 4

వాస్తవిక అర్థము .......... 5

నేపథ్యములు .......... 6

మాదిరులు .......... 7

ముందస్తు సూచనలు .......... 7

ఆధునిక అనువర్తనము .......... 11

నిర్మాణము & విషయములు .......... 14

ఐగుప్తు నుండి విమోచన (నిర్గమ. 1:1-18:27) .......... 14

విమోచనకు ముందు (1:1-4:31) .......... 14

విమోచన కాలములో (5:1-18:27) .......... 17

కనాను కొరకు సిద్ధపాటు (నిర్గమ. 19:1-40:38) .......... 20

ఇశ్రాయేలు యొక్క నిబంధన (19:1-24:11) .......... 21

ఇశ్రాయేలు యొక్క మందిరము (24:12-40:38) .......... 24

ముఖ్య అంశములు .......... 27

నిబంధనను నెరవేర్చువాడు (1:1-4:31) .......... 29

విజయుడైన యుద్ధశూరుడు (5:1-18:27) .......... 32

ఐగుప్తులో .......... 32

ప్రయాణములో (13:17-18:27) .......... 33

నిబంధన ధర్మశాస్త్రమును ఇచ్చినవాడు (19:1-24:11) .......... 35

ప్రస్తుత యుద్ధశూరుడు (24:12-40:38) .......... 38

ముగింపు .......... 42





వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# ఉపోద్ఘాతం

ప్రతి సంస్థ కొన్ని మార్పులను ఎదుర్కొంటుంది, కాని నాయకత్వము ఒక తరమువారి నుండి మరొక తరమువారికి బదిలీ అగునప్పుడు కలుగు మార్పులు విధ్వంసకరముగా ఉంటాయి. సంఘమును స్థాపించినవారిలో చివరి వ్యక్తి మరణించినప్పుడు, లేక ఒక వ్యాపారవేత్త వ్యాపారము నుండి పదవి విరమణ తీసుకున్నప్పుడు, పదవిలో ఉన్నవారు క్రొత్త సవాళ్లను ఎదుర్కొంటారు. కాబట్టి, ఈలాంటి పరిస్థితులలో ఇంచుమించు ప్రతిసారి తలెత్తే ప్రశ్న ఇది: క్రొత్త తరమువారు మునుపటి తరము యొక్క ప్రాధాన్యతలను మరియు ఆచారములను ఎంత వరకు అనుసరించాలి?

అనేక విధాలుగా, వాగ్దాన దేశము యొక్క సరిహద్దులలో గుడారములు వేసుకొని బస చేసినప్పుడు ఇశ్రాయేలు ప్రజలు కూడా ఈ ప్రశ్నను ఎదుర్కొన్నారు. మోషే జీవితము ముగింపునకు చేరుకుంటుంది, మరియు ఇశ్రాయేలీయులు అనేక క్రొత్త సవాళ్లను ఎదుర్కొనుచున్నారు. కాబట్టి, మోషే వారి కొరకు స్థాపించిన ప్రాధాన్యతలను మరియు ఆచారములను ఎంత వరకు పాటించాలో వారికి తెలుసుకోవలసిన అవసరత ఉండినది. వారు వేరే మార్గమును అనుసరించాలా? లేక మోషే మార్గములలో కొనసాగాలా? నేడు నిర్గమకాండము అని పిలువబడు బైబిలులోని రెండవ పుస్తకము ఇవి మరియు ఇలాంటి అనేక ఇతర ప్రశ్నలకు జవాబిచ్చుటకు రూపొందించబడింది.

ఈ పాఠం బైబిలులోని రెండవ పుస్తకమును గూర్చి ప్రస్తావించు *పంచగ్రంథము*లోని భాగము మీద దృష్టిపెడుతుంది. మరియు దీనికి "నిర్గమకాండము యొక్క అవలోకనము" అని పేరు పెట్టాము. ఈ పాఠంలో, నిర్గమకాండము మొదటిగా వ్రాయబడినప్పుడు దాని ఉద్దేశము ఏమిటి మరియు నేడు మన జీవితములకు దానిని మనము ఎలా అనువర్తించుకోవాలి అను విషయములను లోతుగా పరిశీలించుటకు మనలను సిద్ధపరచు అనేక సామాన్య విషయములను  మనము చూద్దాము.

మన పాఠం మూడు ప్రధానమైన భాగములుగా విభాగించబడుతుంది. మొదటిగా, నిర్గమకాండమును అధ్యయనం చేయుచుండగా మనము మనస్సులో ఉంచుకోవలసిన కొన్ని ఆరంభ పరిగణలను చూద్దాము. రెండవదిగా, ఈ పుస్తకము యొక్క నిర్మాణము మరియు విషయములను మనము పరిశీలన చేద్దాము. మరియు మూడవదిగా, నిర్గమకాండములోని కొన్ని ముఖ్య అంశములను మనము చూద్దాము. కొన్ని ఆరంభ పరిగణలను ముందుగా చూద్దాము.

# ఆరంభ పరిగణలు

క్రీస్తు అనుచరులముగా, నిర్గమకాండము పరిశుద్ధాత్మ ప్రేరణలో వ్రాయబడినదని మరియు అది దేవుని వాక్యమైయున్నదని మనము సరిగానే నమ్ముతాము. మనము ఒక సాధారణమైన పుస్తకముతో



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

వ్యవహరించుటలేదని ఈ నమ్మకము మనకు జ్ఞాపకము చేస్తుంది. నిర్గమకాండము దేవుడు తన ప్రజలకు ఇచ్చిన పవిత్ర లేఖనమైయున్నది. కాబట్టి, క్రీస్తు అనుచరులముగా, ఏదో ఒక విధముగా, నేడు మీ మీద నా మీద ఈ పుస్తకమునకు అధికారము ఉన్నది. కాని అదే సమయములో, దేవుడు ఈ పుస్తకమును మొదటిగా కొన్ని వేల సంవత్సరముల క్రితం నివసించిన ప్రజలకు ఇచ్చాడు అను విషయమును మనము మరచిపోకూడదు. కాబట్టి, మన ఆధునిక అనువర్తనములు ఈ పుస్తకము మొదటిగా వ్రాయబడిన ఉద్దేశ్యములకు అనుగుణంగా ఉండునట్లు మనము జాగ్రత్తపడాలి.

మనము నిర్గమకాండమును చూచుట ఆరంభించుచుండగా, నాలుగు వేర్వేరు ఆరంభ పరిగణలను పరిచయం చేస్తాము. మొదటిగా, ఈ పుస్తకము యొక్క గ్రంథకర్తృత్వమును చూద్దాము. ఈ పుస్తకమును ఎవరు వ్రాశారు? రెండవదిగా, ఈ పుస్తకము యొక్క సందర్భమును, అనగా ఈ పుస్తకము ఎప్పుడు ఎవరికి వ్రాయబడినదో చూద్దాము. మూడవదిగా, నిర్గమకాండము యొక్క వాస్తవిక అర్థమును మనము క్రోడీకరిద్దాము. మరియు నాల్గవదిగా, ఈ పుస్తకము యొక్క ఆధునిక అనువర్తనమును ఈ విషయములు ఏ విధంగా నియంత్రించాలో చూద్దాము. ముందుగా నిర్గమకాండము యొక్క గ్రంథకర్తృత్వమును చూద్దాము.

## గ్రంథకర్తృత్వము

నిర్గమకాండము యొక్క గ్రంథకర్తృత్వమును గూర్చిన ప్రశ్న పంచగ్రంథ గ్రంథకర్తృత్వమును గూర్చిన సుదీర్ఘమైన మరియు సంక్లిష్టమైన వివాదములో భాగమైయున్నది. అయితే ఈ పాఠములో, నిర్గమకాండమునకు ఈ వివాదము అనువర్తించబడు కొన్ని మార్గములను మాత్రమే మనము ప్రస్తావిద్దాము.

ఈ పుస్తకములోని విషయములకు మరియు మోషేకు చాలా దగ్గర సంబంధము ఉన్నదని నిర్గమకాండమును పైపైన అధ్యయనం చేయుట ద్వారా కూడా అర్థమవుతుంది. నిర్గమకాండములోని ఎక్కువ భాగమును దేవుడు సీనాయి పర్వతము యొద్ద మోషేకు సూటిగా బయలుపరచాడని ఈ పుస్తకము మరలా మరలా దావా చేస్తుంది. దీనిలో పది ఆజ్ఞలు, నిబంధన గ్రంథము, మరియు ఇశ్రాయేలు మందిరము కొరకు హెచ్చరికలు ఉన్నాయి.

అయితే, పంచగ్రంథమును గూర్చిన ఇతర పాఠములలో మనము చూసినట్లు, అనేకమంది విమర్శనాత్మక పండితులు మోషే గ్రంథకర్తృత్వమును తిరస్కరించారు. నిర్గమకాండముతో సహా, పంచగ్రంథము యొక్క వేదాంతశాస్త్రము మోషే దినముల కంటే కూడా ఎక్కువ పురోగతి చెందినదిగా ఉన్నదని వారు వాదించారు. బదులుగా, ఇది క్రీ.పూ ఆరవ శతాబ్దములో బబులోను చెర యొక్క ముగింపునకు ముందు వ్రాయబడియుండవచ్చని వారంటారు.

ఈ విమర్శనాత్మక దృక్పథములు ప్రచిలితమైనప్పటికీ, వాటి వెనుక ఉన్న చారిత్రిక మరియు వేదాంతశాస్త్ర పూర్వభావిత్వములు ఊహాత్మకముగాను, అవిశ్వసనీయముగాను ఉన్నాయి. అంతేగాక, ఇవాంజెలికల్ దృక్కోణములో నుండి, లేఖనములలో మనము కనుగొను అధికారిక సాక్ష్యములను అనుసరించుట చాలా కీలమైనదిగా ఉన్నది. నిర్గమకాండము గ్రంథముతో సహా పంచగ్రంథము అంతటికి మోషే బాధ్యుడు అను దృక్పథమును పాత నిబంధన రచయితలు, క్రీస్తు, ఆయన అపొస్తలులు మరియు ప్రవక్తలు ఏకవాక్యముగా ప్రతిపాదించారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మోషేను ఈ గ్రంథము యొక్క “ప్రాధమికమైన,” “వాస్తవమైన,” లేక “ప్రాముఖ్యమైన” రచయిత అని పిలచుట ద్వారా ఇవాంజెలికల్ క్రైస్తవులు మోషే గ్రంథకర్తృత్వము మీద ఈ నమ్మకమును ఆమోదించారు. అంటే మోషే ఊరకే కూర్చొని నిర్గమకాండము అంతటిని తన సొంత చేతితో వ్రాశాడని దీని అర్థము కాదు. అయితే అతని జననము మరియు ఆరంభ బాల్యము మినహా ఈ గ్రంథములో నివేదించబడిన ప్రతి సన్నివేశమునకు మోషే నమ్మశక్యమైన ప్రత్యక్షసాక్షిగా ఉన్నాడు. అతడు ఆ కాలములోని జాతీయ నాయకుల పరంపరను అనుసరించి తన మార్గదర్శకత్వములో వ్రాయుటకు లేఖకులను లేక శాస్త్రులను పురమాయించియుంటాడు. కాబట్టి, ఏది ఏమైనా, మోషే కాలములో పరిశుద్ధాత్ముని యొక్క ప్రేరేపణలో నిర్గమకాండము వ్రాయబడినది అనే నిశ్చయతను మనము కలిగియుండవచ్చు.

> నిర్గమకాండమును ఎవరు వ్రాశారు అనునది ఒక ప్రాముఖ్యమైన ప్రశ్న, మరియు మనం స్వయంగా ఈ గ్రంథమును చదివి, అది నివేదించు సన్నివేశముల యొక్క చరిత్రను శ్రద్ధగా పరిశీలించినట్లయితే, నేడు మనము కలిగియున్న నిర్గమకాండములోని ఎక్కువ భాగమును మోషే వ్రాయలేదు అనుటకు ఏ కారణము లేదు. ఆ గ్రంథములో మోషే దేవుని ప్రతినిధిగా చిత్రీకరించబడ్డాడు. దేవుని ప్రజల చరిత్ర అంతటిలో, స్వయంగా యేసుకు ముందు ఇతర ప్రవక్తలందరి కంటే ఎక్కువగా దేవుని ఎరిగిన వ్యక్తిగా పంచగ్రంథము అంతటా అతడు ఒక విశేషమైన ప్రతినిధిగా చిత్రీకరించబడ్డాడు, మరియు అతడు దేవుని అంత సన్నిహితంగా ఎరిగియున్నాడు కాబట్టి, అతడు దేవునితో ఒక మనిషి స్నేహితునితో మాటలాడు విధముగా ముఖాముఖిగా మాట్లాడాడు, మరియు ప్రజల కొరకు దేవుని ప్రతినిధిగా ప్రాముఖ్యమైన పాత్రను పోషించాడు. మరియు పంచగ్రంథము తరువాత కొనసాగు పాత నిబంధన మోషే వ్రాసిన ఈ ధర్మశాస్త్ర గ్రంథమును గూర్చి తరచుగా ప్రస్తావిస్తు, దివారాత్రములు దానిని ధ్యానించమని ప్రజలను ప్రోత్సహిస్తుంది కాబట్టి, ఈ పుస్తకము యొక్క రచయిత మోషే అని ఆలోచన చేయుట సమంజసమే అవుతుంది. ఇప్పుడు, స్థలముల పేర్లను లేక కాలక్రమములో కొన్ని వ్యాకరణ రకముల వంటివాటిని తరువాత కాలములో ఒక ప్రేరేపిత హస్తము, లేక ఇశ్రాయేలులో ఒక ప్రవక్త హస్తము నవీకరించియుంటుంది. కాని, అవును, నిర్గమకాండము మోషే కాలములో నుండి, మోషే శైలిలో నుండి వెలువడింది అని నేను నమ్ముతాను... మరియు ఈ విధంగా మోషే ఇశ్రాయేలులో దేవుని యొక్క ముఖ్యమైన ప్రతినిధిగా మాత్రమేగాక, ఒక గ్రంథకర్తగా, ఒక పుస్తక రచయితగా చిత్రీకరించబడ్డాడు.
>
> — ప్రొఫెసర్. థామస్ ఎగ్గర్

మోషే గ్రంథకర్తృత్వమును గూర్చిన ఈ ఆలోచనలను మనస్సులో ఉంచుకొని, ఆరంభ పరిగణలలో రెండవ భాగమైన, నిర్గమకాండము వ్రాయబడిన సందర్భము, లేక పరిస్థితిని ఇప్పుడు మనము చూడవలసియున్నది.

## సందర్భము

విశాలమైన దృక్పథములో, మోషే నిర్గమకాండమును నిర్గమ. 3:1-4:31లో మండుచున్న పొద యొద్ద అతని పిలుపు మరియు ద్వితీ. 34:1-12లో మోయాబు మైదానములలో అతని మరణమునకు మధ్య కాలములో వ్రాశాడు. అయితే దీని కంటే ఖచ్చితముగా ఉండునట్లు రుజువులు మనకు సహాయపడతాయి. ఇశ్రాయేలు వాగ్దాన దేశము యొక్క సరిహద్దులలో గుడారములు వేసుకొని బస చేసిన తరువాత ఈ పుస్తకము పూర్తి చేయబడింది అని నిర్గమకాండములోని కనీసం రెండు ఆధారములు బయలుపరుస్తాయి. నిర్గమ. 16:35ను చూడండి, అక్కడ మనము ఈ మాటలను చదువుతాము:

> ఇశ్రాయేలీయులు నివసింపవలసిన దేశమునకు తాము వచ్చు నలుబది యేండ్లు మన్నానే తినుచుండిరి; వారు కనాను దేశపు పొలిమేరలు చేరువరకు మన్నాను తినిరి (నిర్గమ. 16:35).

నిర్గమకాండము గ్రంథము పూర్తి చేయబడక ముందే ఈ సన్నివేశములు జరిగియుండవచ్చు. కాబట్టి, ఇశ్రాయేలు అప్పటికే అరణ్యములో "నలుబది యేండ్లు" సంచారము చేసింది అని మనకు తెలుసు. మరియు వారు "స్థిరమైన భూమికి" లేక "కనాను దేశ సరిహద్దుకు" చేరుకున్నారు.

అంతిమ సంకలనమును గూర్చిన ఇలాంటి విషయమే ఈ పుస్తకము యొక్క ఆఖరి వచనమైన, నిర్గమ. 40:38లో కనిపిస్తుంది.

> ఇశ్రాయేలీయులందరి కన్నుల ఎదుట పగటివేళ యెహోవా మేఘము మందిరముమీద ఉండెను. రాత్రివేళ అగ్నిదానిమీద ఉండెను. వారి సమస్త ప్రయాణములలో ఈలాగుననే జరిగెను (నిర్గమ. 40:38).

"వారి సమస్త ప్రయాణములలో" దేవుని మహిమగల సన్నిధి మందిరము మీద ఉండెను అని ఈ వాక్యభాగము ప్రస్తావించుచున్న విషయమును గమనించండి. మోషే నిర్గమకాండమును తన జీవితము యొక్క చివరి దినములలో పూర్తి చేశాడని ఈ చారిత్రిక గమనిక స్పష్టము చేస్తుంది. ఇశ్రాయేలీయులు తమ నలుబది సంవత్సరముల అరణ్య సంచారమును పూర్తి చేసి మోయాబు మైదానములకు వచ్చిన *తరువాత* అతడు దీనిని వ్రాశాడు.

ఇప్పటి వరకు, నిర్గమకాండము గ్రంథము యొక్క గ్రంథకర్తృత్వము మరియు సందర్భమునకు సంబంధించిన పలు ఆరంభ పరిగణలను మనము చూశాము. ఇప్పుడు, దాని యొక్క వాస్తవిక అర్థమును క్రోడీకరించు పరిస్థితిలో మనము ఉన్నాము. నిర్గమకాండమును సంకలనము చేయుటకు దేవుడు మోషేను ఎందుకు ఎన్నుకున్నాడు? మరియు మోయాబు మైదానములలో మోషే తన వాస్తవిక ఇశ్రాయేలీయ శ్రోతలపై ఎలాంటి ప్రభావమును చూపాలని అనుకున్నాడు?



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## వాస్తవిక అర్థము

పాత నిబంధనలో తరచుగా కనిపించు అనేక సామాన్య లక్ష్యములను మోషే కలిగియున్నాడని ఆరంభములోనే మనము గుర్తించాలి. ఉదాహరణకు, నిర్గమకాండము ఇశ్రాయేలును తరచుగా దేవుని స్తుతించునట్లు మరియు ఆరాధించునట్లు పురికొల్పింది కాబట్టి నిర్గమకాండము దేవుని మహిమకు సంబంధించిన పుస్తకముగా ఉన్నది. అయితే దేవుని గూర్చిన సత్యములను ఇది మరలా మరలా వివరిస్తుంది కాబట్టి ఇది వేదాంతశాస్త్ర సంబంధమైన పుస్తకముగా కూడా ఉన్నది. మరియు ఈ పుస్తకమంత ఇశ్రాయేలు యొక్క జాతీయ జీవితమును రూపించుటకు రూపొందించబడింది కాబట్టి ఇది ఈ భావనలో రాజకీయమైనదిగా కూడా ఉన్నది. ఇది అబద్ధ అభిప్రాయములను వ్యతిరేకిస్తుంది కాబట్టి, ఇది తార్కిక పుస్తకముగా కూడా ఉన్నది. ఇశ్రాయేలు దేవునికి ఎలా లోబడి ఉండాలో ఇది బయలుపరుస్తుంది కాబట్టి ఇది నైతిక పుస్తకముగా కూడా ఉన్నది. దేవుని పట్ల స్వామిభక్తి చూపమని ఇది పురికొల్పుతుంది కాబట్టి, స్వామిద్రోహమునకు విరోధముగా హెచ్చరిస్తుంది కాబట్టి, ఇది పురికొల్పు పుస్తకముగా కూడా ఉన్నది. ఇవి మరియు ఇలాంటి అనేక ఇతర లక్ష్యములు నిర్గమకాండము గ్రంథమును వర్ణిస్తాయి.

నిర్గమకాండము ఇవి మరియు అనేక ఇతర లక్షణములను బైబిలు పుస్తకములతో పంచుకుంటుంది కాబట్టి, నిర్గమకాండమును వ్రాయుటకు మోషే ఒక విశేషమైన మరియు ప్రాముఖ్యమైన ఉద్దేశ్యమును కలిగియున్నాడు. ఈ ఐక్యపరచు ఉద్దేశ్యమును ఈ క్రింది విధముగా క్రోడీకరించుట సహాయకరంగా ఉంటుంది:

> **నిర్గమకాండము తమ జీవితముల మీద మోషే యొక్క నిలిచియుండు అధికారమును గుర్తించునట్లు రెండవ తరమును నిర్దేశించుటకుగాను నిర్గమనం తరువాత మొదటి తరమువారి మీద మోషే కలిగియుండిన దైవికమైన అధికారమును తెలియజేస్తుంది.**

నిర్గమకాండము యొక్క వాస్తవిక అర్థమును గూర్చి మనకు సహాయకరమైన దృక్పథమును కలిగించు మూడు విషయములను ఈ సారాంశము ప్రస్తావిస్తుంది. మొదటిగా, ఈ పుస్తకము చాలా వరకు నిర్గమనం తరువాత మొదటి తరమువారిని *గూర్చి* వ్రాయబడింది, కాని అదే సమయములో, ఈ పుస్తకము నిర్గమనం తరువాత రెండవ తరము వారి *కొరకు* కూడా వ్రాయబడింది అని ఇది మనకు జ్ఞాపకము చేస్తుంది.

నిర్గమకాండము చాలా వరకు మోషే ఇశ్రాయేలును ఐగుప్తు నుండి బయటకు తీసుకొనివచ్చిన తరువాత జరిగిన సన్నివేశములను వర్ణిస్తుంది అని నిర్గమకాండమును గూర్చి అవగాహన కలిగినవారందరికీ తెలుసు. ఈ కాలమును మనము, చరిత్రలో "ఆ లోకము" అని పిలువవచ్చు. అయినను, మొదటి తరమువారి యొక్క "ఆ లోకము"ను గూర్చి నిర్గమకాండము బోధించు ప్రతి విషయము మనము "వారి లోకము" అని పిలుచు నిర్గమకాండము యొక్క *రెండవ* తరము వారితో కూడా మాట్లాడుటకు రూపొందించబడింది.

ఇప్పుడు, పురాతన ఇశ్రాయేలీయులలో అనేకమందికి చదవడం రాదు అను విషయమును కూడా మనము మనస్సులో ఉంచుకోవాలి. కాబట్టి, రెండవ తరము "శ్రోతలను" గూర్చి మనము మాట్లాడునప్పుడు, ప్రతి పురుషుడు, స్త్రీ మరియు బిడ్డ నిర్గమకాండము యొక్క ఒక ప్రతుని తీసుకొని



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

స్వయంగా చదివారని మన అర్థము కాదు. భిన్నముగా, పాత నిబంధనలోని ఇతర భాగముల వలె, మోషే నిర్గమకాండమును ప్రాథమికముగా ఇశ్రాయేలులోని *నాయకుల* కొరకు వ్రాశాడు. యెహోషువ, గోత్రపు నాయకులు, న్యాయాధిపతులు, యాజకులు మరియు లేవీయుల కొరకు నిర్గమకాండము ప్రధానముగా వ్రాయబడింది. ఈ పుస్తకములోని విషయములను ఇశ్రాయేలువారందరికీ అందించి, వారికి వివరించు బాధ్యత ఈ నాయకులకు ఇవ్వబడింది. ఈ కారణము చేత, దేశముగా రెండవ తరమువారు ఎదుర్కొన్న సమస్యలను గూర్చి నిర్గమకాండము సూటిగా మాట్లాడుతుంది.

"వారి లోకము" మీద మోషే పెట్టిన దృష్టి ఎక్కువ శాతం పరోక్షముగానే ఉన్నదని గమనించుట కూడా ప్రాముఖ్యమైయున్నది. అయినను, మోషే "వారి లోకము"ను మనస్సులో ఉంచుకొని వ్రాశాడని మనకు నిశ్చయత కలుగునట్లు రెండవ తరము తరచుగా ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. మనము ఇంతకు ముందే గుర్తించినట్లు, నిర్గమ. 16:35 మరియు 40:38 రెండవ తరమును ప్రస్తావిస్తాయి. అంతేగాక, నిర్గమ. 6:13-27లో నమోదు చేయబడిన వంశావళి అహరోను మనుమడైన ఫీనెహాసు వరకు వ్యాపిస్తుంది. విశేషముగా రెండవ తరమువారికి ఔచిత్యముగా ఉన్న విషయములను గూర్చి మాట్లాడు అనేక ఇతర వాక్యభాగములను మనము తరువాత చూద్దాము. మోషే ఈ పుస్తకమును సంకలనం చేయుచుండగా నిర్గమనం తరువాత మొదటి మరియు రెండవ తరముల ప్రజలను దృష్టిలో ఉంచుకున్నాడని ఇవి మరియు ఇలాంటి ఇతర వాక్యభాగములు సూచిస్తాయి.

నిర్గమకాండము "మొదటి తరము" వారి కొరకు తెలియపరచిన ప్రతి విషయము, "రెండవ తరమువారిని *నిర్దేశించుటకు*" వ్రాయబడింది అని నిర్గమకాండము కొరకు మోషే కలిగియుండిన వాస్తవిక ఉద్దేశ్యము యొక్క సారాంశములో రెండవ భాగమైయున్నది. అనగా, తన వాస్తవిక, రెండవ తరము శ్రోతలు దేవుని సేవలో విధేయులుగా ఉండాలనే ఉద్దేశ్యముతో మోషే నిర్గమకాండమును సంపూర్ణ అధికారము కలిగిన గ్రంథముగా వ్రాశాడు.

నిర్గమకాండమును మనము అధ్యయనం చేయుచుండగా, రెండవ తరము వారికి ఔచిత్యముగా ఉండు విధముగా మోషే జాగ్రత్తగా తన చారిత్రిక నివేదికను రూపొందించాడని మనకు స్పష్టమవుతుంది. కనాను సరిహద్దులో తనతో కూడా గుడారములలో బసచేసిన వారితో మాట్లాడుటకు, మొదటి మరియు రెండవ తరముల వారికి మధ్య ఉన్న అనేక భేదములను మోషే జాగ్రత్తగా పరిశీలన చేయవలసియుండెను. వారు వేర్వేరు కాలములలో మరియు స్థలములలో నివసించారని మరియు వేర్వేరు సవాళ్లను ఎదుర్కొన్నారని అతనికి బాగా తెలుసు. కాబట్టి, వారి మధ్య ఉన్న సంబంధములను ఎత్తి చూపుటకుగాను మోషే నిర్గమకాండములోని ప్రతి భాగమును చాలా జాగ్రత్తగా రూపొందించాడు. ఈ సంబంధములు వారికి మరియు తమ ముందు తరమువారికి మధ్య ఉన్న తేడాను అధిగమించుటలో వాస్తవిక శ్రోతలకు సహాయపడ్డాయి.

## నేపథ్యములు

ఈ పుస్తకము యొక్క అధికారమును తన వాస్తవిక శ్రోతలకు రుజువు చేయుటకు మోషే మూడు సామాన్య రకములైన సంబంధములను ఉపయోగించాడు. తన సులువైన సంబంధములలో చారిత్రిక నేపథ్యములు ఉన్నాయి. ఈ వాక్యభాగములు వాస్తవిక శ్రోతలు కలిగియుండిన ప్రత్యేక అధికారములు మరియు బాధ్యతల యొక్క చారిత్రిక మూలములను కలిగియున్నాయి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

నిర్గమ. 3:8లో ఒక విధమైన చారిత్రిక నేపథ్యము కనిపిస్తుంది, అక్కడ ఇశ్రాయేలుకు దేవుడిచ్చిన వాగ్దానము ఆ వాగ్దానము యొక్క నెరవేర్పుతో సంబంధం కలిగియుంటుంది. ఈ వచనములో, దేవుడు ఇశ్రాయేలును ఐగుప్తులో నుండి "పాలు తేనెలు ప్రవహించు దేశమునకు" తీసుకొనివెళ్తానని వాగ్దానం చేశాడు. ఈ వాగ్దానము మోషే యొక్క శ్రోతలకు ఔచిత్యమైనదిగా ఉన్నది, ఎందుకంటే వారు తమ దినములలో ఈ వాగ్దానము యొక్క నెరవేర్పును చూచుటకు చాలా దగ్గరగా ఉన్నారు.

దేవుడు మొదటి తరమువారికి ఇచ్చిన ఆజ్ఞలలో మరియు తద్వారా రెండవ తరమువారికి ఇచ్చిన బాధ్యతలలో మరొక రకమైన చారిత్రిక నేపథ్యము కనిపిస్తుంది. ఉదాహరణకు, నిర్గమ. 20:1-17లో, దేవుడు మొదటి తరమువారికి పది ఆజ్ఞలను ఎలా ఇచ్చాడో మోషే నివేదించాడు. ఈ సన్నివేశము రెండవ తరము వారి యొక్క నైతిక బాధ్యతలకు ఒక ఆధారమును రూపొందించింది.

## మాదిరులు

చారిత్రిక నేపథ్యములతో పాటుగా, తన శ్రోతలు పాటించవలసిన లేక తిరస్కరించవలసిన కొన్ని చారిత్రిక మాదిరులను కూడా మోషే ఇచ్చాడు. ఇలాంటి సంబంధమును స్థాపించుటకు, మొదటి తరము మరియు రెండవ తరము శ్రోతల మధ్య అనేక పోలికలను ఎత్తిచూపుటకు మోషే కొన్ని వాక్యభాగములను రూపొందించాడు.

అనేక వాక్యభాగములలో, తన వాస్తవిక శ్రోతలు తిరస్కరించునట్లు అభావార్థకమైన మాదిరులను ఇచ్చుటకు కూడా మోషే ఇలాంటి పోలికలను ఉపయోగించాడు. ఉదాహరణకు, నిర్గమ. 15:24, 16:2-12, మరియు 17:3లో సీనాయికి ప్రయాణము చేయుచుండగా ఇశ్రాయేలు మరలా మరలా తిరుగుబాటు చేసి సణిగిన విధానములు, రెండవ తరమువారు తిరస్కరించవలసిన అభావార్థకమైన మాదిరులకు ప్రాతినిధ్యము వహించాయి.

దీనికి భిన్నముగా, మోషే తన శ్రోతలకు అనుసరించవలసిన భావార్థకమైన మాదిరులను కూడా ఇచ్చాడు. ఉదాహరణకు, నిర్గమ. 36:8-38లో మందిరమును నిర్మించుటకు దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చిన హెచ్చరికలను వారు పాటించారు. రెండవ తరమువారు తరువాత దినములలో దేవుని సేవించినప్పుడు వారు అనుసరించు భావార్థకమైన మాదిరికి ఇది ప్రాతినిధ్యం వహించింది.

మరియు మోషే మిశ్రమ మాదిరులను అనగా, భావార్థక మరియు అభావర్థక లక్షణములను కలిగియున్న పాత్రలను కూడా ఇచ్చాడు. ఒక ఉదాహరణగా, నిర్గమ. 7:8-13లో, అహరోను దేవుని మాట విని ఫరో ఎదుట తన కర్రను పడవేశాడు. అతని విధేయత ఐగుప్తు నుండి ఇశ్రాయేలు యొక్క విడుదలకు కారణమైయ్యింది. కాని, 32:1-35లో, ప్రజలు ఆరాధించుటకు అతడు బంగారు దూడను చేశాడు, మరియు అతని అవిధేయత ఇశ్రాయేలు కఠినముగా శిక్షించబడుటకు కారణమైయ్యింది. ఇది రెండవ తరము శ్రోతలకు అనుసరించుటకు మరియు తిరస్కరించుటకు ఒక మిశ్రమ మాదిరిని అందించింది.

## ముందస్తు సూచనలు

మూడవ స్థానములో, కొన్ని సందర్భాలలో తన రెండవ-తరము శ్రోతలకు చారిత్రిక ముందస్తు సూచనలుగా, లేక సూచనలుగా పని చేయు విధముగా సన్నివేశముల యొక్క నివేదికలను రూపొందించాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> చాలాసార్లు బైబిలు కథనములో, ఆధునిక చలనచిత్రములు మరియు సాహిత్యము వలె రచయితలు ముందస్తు సూచనలను ఉపయోగిస్తారు. మరియు మోషే ఐగుప్తును విడచి, బావి యొద్దకు వచ్చి దుష్టులైన కాపరుల చేతిలో నుండి యిత్రో కుమార్తెలను రక్షించినప్పుడు లేక విడిపించినప్పుడు నిర్గమకాండము యొక్క ఆరంభములోనే ఒక మంచి ఉదాహరణ మనకు ఇవ్వబడినది. ఈ వాక్యభాగము మోషేను విమోచకుని పాత్రలో చిత్రీకరిస్తుంది. మరియు అది దేవుడు అతని ద్వారా చేయగోరుచున్న పనికి ముందస్తు సూచనగా ఉన్నది. అతడు ఐగుప్తునకు తిరిగివెళ్లి దేవుని ప్రజలను బానిసత్వము నుండి విడిపించబోవుచున్నాడు.
>
> — డా. రాబర్ట్ బి. చిషోం, జు.

ఇలాంటి సంబంధము పాత నిబంధనలోని ఇతర పుస్తకములలో జరిగినంతగా నిర్గమకాండములో జరుగదు. కాని కొన్ని సందర్భాలలో, మోషే మునుపు జరిగిన కొన్ని సన్నివేశములను ఖచ్చితముగా తన వాస్తవిక శ్రోతల అనుభవములను పోలియున్న విధముగా వర్ణించాడు. చరిత్ర రెండవ తరమువారి దినములలో పునరావృతమవుతుంది అని ఈ ముందస్తు సూచనలు సూచించాయి. ఉదాహరణకు, నిర్గమ. 13:18లో, ఇశ్రాయేలీయులు "యుద్ధమునకు సిద్ధమై ఐగుప్తు నుండి బయటకు వెళ్లారు." మొదటి తరమువారు చేసిన ఈ సైనిక ఏర్పాటు స్వాధీనపరచుకొనుటకు సిద్ధపడునట్లు సైన్యముగా ఏర్పడిన రెండవ తరమువారికి ముందస్తు సూచనగా ఉన్నది.

అదే విధముగా, మందిరము సక్రమముగా పని చేయుట ఆరంభమైన తరువాత, దేవుడు తన ప్రజల ప్రయాణములో పొగగాను, అగ్నిగాను ఉండి నడిపించాడు అని నిర్గమ. 40:34-38 తెలియపరుస్తుంది. నలభై సంవత్సరముల తరువాత రెండవ తరము శ్రోతలను వారి దినములలో దేవుని సన్నిధి ఏ విధంగా నడిపించబోతుందో చూచుటకు ఈ చారిత్రిక వాస్తవము ఎదురుచూసింది.

మనము ఇంతకు ముందే చూసినట్లు, రెండవ తరమువారికి నేపథ్యములుగాను, మాదిరులుగాను మరియు ముందస్తు సూచనలుగాను ఉండు విధముగా మోషే మొదటి తరమువారి యొక్క చారిత్రిక నివేదికను రూపొందించాడు. వారిని దేవుని సేవలో నడిపించుటకుగాను అతడు ఇలా చేశాడు. కాని ఇదంతా మనలను నిర్గమకాండము యొక్క వాస్తవిక అర్థము యొక్క సారాంశములోని అత్యంత ప్రాముఖ్యమైన మూడవ విషయములోనికి నడిపిస్తుంది. తమ జీవితముల మీద మోషే కలిగియుండిన నిలిచియుండు అధికారమును రెండవ తరమువారు గుర్తించునట్లు మొదటి తరమువారి మీద మోషే కలిగియుండిన దైవికమైన అధికారమును సమర్థించుటకు నిర్గమకాండము గ్రంథము ప్రధానముగా వ్రాయబడింది.

ఇప్పుడు, నిర్గమకాండములో తరచుగా అహరోను మోషే ప్రక్కన కనిపిస్తాడను విషయమును ప్రస్తావించవలసియున్నది. అయితే అహరోను పేరు చేర్చబడినప్పటికి కూడా, తమ మీద మోషే యొక్క కొనసాగు అధికారమును ఉద్ఘాటించమని నిర్గమకాండములోని ప్రతి భాగము రెండవ తరమునకు పిలుపునిచ్చింది. వారు మోషే యొక్క వేదాంతశాస్త్ర దృక్కోణములకు, అతని నైతిక నియమాలకు, జాతీయ పథకాలకు, మరియు మిగిలినవాటికి సమర్పించుకోవాలి. ఈ అంశము ఎంత వ్యాప్తి కలిగినదిగా ఉన్నదో ఈ పాఠంలో తరువాత మనము చూద్దాము. కాని, ఇప్పుడు మాత్రం మోషే యొక్క

ప్రాముఖ్యతను మరియు ఇశ్రాయేలు మీద అతడు కలిగియుండిన అధికారమును ఈ పుస్తకము ఉద్ఘాటించు రెండు మార్గములను మాత్రం క్లుప్తంగా ప్రస్తావిద్దాము.

మొదటిగా, నిర్గమకాండము యొక్క అభినయములో మోషే కేంద్ర స్థానమును అధిరోహించాడు అని చూచుట అంత కష్టమైన పని కాదు. స్పష్టముగా, నిర్గమకాండములోని మొదటి రెండు అధ్యాయములు మోషేను పరిచయం చేయవు. అయితే నిర్గమ. 2:10లో అతని పేరును మనము తెలుసుకున్న తరువాత, పుస్తకములో జరుగు ప్రతి విషయము ఏదో ఒక విధముగా మోషేతో ముడిపడి ఉంటుంది. దేవుడు తన ప్రజలను ఐగుప్తు నుండి విడిపించుటకు సిద్ధపడినప్పుడు, ఆయన మోషేను పిలచాడు. ఐగుప్తీయులకు విరోధముగా ఇవ్వబడిన ప్రతి తీర్పులో మోషే ముఖ్య భూమికను పోషించాడు. మోషే దేవుని మాటకు విధేయుడై తన చేతిని నీటి మీద చాచినప్పుడు సముద్రము పాయలైయ్యింది. దేవుడు దేశమును ఐగుప్తు నుండి సీనాయి పర్వతము యొద్దకు నడిపించినప్పుడు మోషే ఇశ్రాయేలుకు నాయకునిగా పని చేశాడు. దేవుడు ఇశ్రాయేలుతో తన నిబంధనను మోషే ద్వారా చేశాడు. మోషే దేవుని తరుపున పది ఆజ్ఞల పలకలను మరియు నిబంధనా గ్రంథమును ప్రజలకు అందించాడు. మందిరము కొరకు దేవుడు మోషేకు తన హెచ్చరికలను ఇచ్చాడు. సీనాయి పర్వతము యొద్ద ఇశ్రాయేలీయులు విగ్రహారాధన చేసినప్పుడు మోషే దేవుని సేవించాడు. మరియు మోషే మందిరము యొక్క నిర్మాణమును ముందుండి నడిపించాడు.

రెండవదిగా, ఇశ్రాయేలు మీద మోషే కలిగియుండిన అధికారమును నిర్గమకాండము మాటిమాటికి ఎత్తి చూపుతుంది. నిర్గమ. 2:14; 5:21; 15:24; 16:2 మరియు 3; మరియు 17:2 వంటి వాక్యభాగములలో ఇశ్రాయేలీయులు మరలా మరలా తమ నాయకునిగా మోషే యొక్క అధికారమును ప్రశ్నించారు అను సత్యముతో ఈ పుస్తకము వ్యవహరిస్తుంది. కాని ఇతర సమయాలలో, నిర్గమ. 4:31; 14:31; మరియు 20:19 వంటి వాక్యభాగములలో ఇశ్రాయేలీయులు మోషే యొక్క అధికారమును ఒప్పుకున్నారు. మరియు నిర్గమ. 6:1-8 మరియు 10-13; 24:2; మరియు 34:1-4 వంటి వాక్యభాగములలో తాను స్వయంగా మోషేను ఇశ్రాయేలు యొక్క అధికారిక నాయకునిగా అభిషేకించానని దేవుడిచ్చిన నిశ్చయతను గూర్చి మనము చదువుతాము. ఒక ఉదాహరణగా, నిర్గమ. 19:9లో సీనాయి పర్వతము యొద్ద జరుగబోవుచున్న తన ప్రత్యక్షతను గూర్చి దేవుడు మోషేకు వివరించిన విధానమును వినండి:

> యెహోవా మోషేతో ఇదిగో నేను నీతో మాటలాడునప్పుడు ప్రజలు విని నిరంతరము నీయందు నమ్మకముంచునట్లు నేను కారు మబ్బులలో నీయొద్దకు వచ్చెదనని చెప్పెను (నిర్గమ. 19:9)

ఈ వాక్యభాగము సూచించుచున్నట్లు, దేవుడు మోషేతో మాట్లాడుచున్నప్పుడు ఇశ్రాయేలీయులు విని "[మోషే] యందు నమ్మకముంచునట్లు" దేవుడు సీనాయి పర్వతము మీద "కారు మబ్బు"లో ప్రత్యక్షమయ్యాడు. ఇక్కడ మనము చూస్తునట్లు, నిర్గమకాండము వ్రాయబడిన అత్యంత ప్రాముఖ్యమైన కారణము వైపుకు ఈ వచనము మన దృష్టిని ఆకర్షిస్తుంది. నిర్గమకాండము ఇశ్రాయేలు మీద మోషే యొక్క నిలిచియుండు అధికారమును సమర్థించింది.

ఇవాంజెలికల్ క్రైస్తవులు నిర్గమకాండము వంటి పుస్తకముతో, లేక ఏదో ఒక ఇతర పుస్తకముతో వ్యవహరించుచున్నప్పుడు, వారంతా దేవుని కేంద్రముగా చేయుటకు ప్రయత్నిస్తారు, అనగా ప్రతిదానికి కేంద్రముగా దేవుని ఉంచుతారు, అలాగైతే ప్రతి పుస్తకము మరియు ప్రతి పుస్తకములోని ప్రతి విషయము దేవునికి సంబంధించినదేగదా. కాని వాస్తవానికి, నిర్గమకాండమును మీరు చూసినప్పుడు మీకు ఆ ఆలోచన కలుగదు. దేవుడు ప్రాముఖ్యమైనవాడు, మరియు అనేకవిధాలుగా, దేవుడు ముఖ్య పాత్రగా ఉన్నాడు, మరియు నిర్గమకాండము పుస్తకము తెలియపరచు చరిత్రను ఆయన శాసించాడు; ఐగుప్తు నుండి ఇశ్రాయేలును విమోచించినది ఆయనే; ధర్మశాస్త్రమును ఇచ్చినది ఆయనే; మందిరమును ఇచ్చినది ఆయనే. కాని అదే సమయములో, నిర్గమకాండము పుస్తకములో ఇవ్వబడిన సన్నివేశముల యొక్క సాహిత్య నిర్మాణమును మీరు చూసినప్పుడు, మీరు కనుగొనునది మొదటిగా వింతగా అనిపించవచ్చు, కాని అది నిజమని నేననుకుంటున్నాను, కాని ఒక మినహాయింపు ఉంది, ఏమిటంటే నిర్గమకాండము అంతటిలో మోషే ద్వారా కాకుండా దేవుడు ఏ పని కూడా చేయలేదు. నిర్గమకాండములో మోషేతో ప్రమేయం లేకుండా దేవుడు స్వతహాగా చేసిన ఒకే ఒక్క పని, మొదటి అధ్యాయములో మంత్రసానులను ఆశీర్వదించుట. కాబట్టి, దేవుడు ప్రత్యక్షమై ఇశ్రాయేలు కొరకు కార్యములను చేయుటను నిర్గమకాండములో మనము చూస్తాము, కాని మోషే ఎల్లప్పుడు ఆ కార్యము మధ్యలో ఉంటాడు, ఎందుకంటే దేవుడు ఆ కార్యమును చేయు పరికరము అతడు అయ్యున్నాడు. మరియు దీనికి కారణము ఏమిటంటే, మోషే మరియు అతని జీవితము ముగింపునకు వచ్చినది, మోషే ఇశ్రాయేలును విడచి వెళ్లబోవుచున్నాడు, కాని దేవుడు ఇశ్రాయేలును విడచి వెళ్లడు. కాబట్టి వాస్తవము ఏమిటంటే, మీరు నిర్గమకాండమును చదువుచుండగా, మోయాబు మైదానములో పూర్తి చేయబడిన పుస్తకమును, మోషే ఇశ్రాయేలును విడచి వెళ్లబోవుచున్నాడు అను విషయముతో వ్యవహరించు పుస్తకమును మీరు చదువుచున్నారు. మరియు ఫలితముగా, మనము నిర్గమకాండమును చూసినప్పుడు, ఇశ్రాయేలు ఇలాంటి ప్రశ్నలను అడుగుతుంది: మనలను ఎవరు నడిపిస్తారు? వారు మనలను ఎలా నడిపిస్తారు? వారు ఎలాంటి ప్రాధాన్యతలను కలిగియుండాలి? మోషే మనలను విడచి వెళ్లబోవుచున్నాడు గనుక, మన దినములలో మనము ఎలాంటి అధికారమును అనుసరించాలి? ఇలాంటి ప్రశ్నలకు జవాబిచ్చుటకు నిర్గమకాండము రూపొందించబడింది. దేవుడు ఇశ్రాయేలును ఐగుప్తు నుండి విడిపించాడు, కాని మోషే ద్వారా ఇశ్రాయేలును ఐగుప్తు నుండి విడిపించాడు అనునది వాస్తవము. అవును, దేవుడు ఇశ్రాయేలుకు ధర్మశాస్త్రమునిచ్చాడు, కాని ధర్మశాస్త్రమును మోషే ద్వారా ఇచ్చాడు. అవును, దేవుడు మందిరమును, తన పరిశుద్ధ యుద్ధ గుడారమును ఇచ్చాడు, కాని దానిని కూడా మోషే ద్వారా

> ఇచ్చాడు. నిర్గమకాండము యొక్క ఉద్ఘాటన ఇదే. కాబట్టి, మొదటి తరములో జరిగిన వృత్తాంతములను చెప్పుట ద్వారా రెండవ తరమువారి మీద మోషే యొక్క అధికారమును నిర్గమకాండము నిర్ధారిస్తుంది మరియు ప్రజల ఎదుట మోషే దేవుని ద్వారా ఏ విధంగా ఘనపరచబడ్డాడో, మరియు ఆ ఘనత వలన, అతడు మరణించబోవుచున్నప్పటికీ రెండవ తరము వారి ఎదుట కూడా మోషే ఏ విధంగా ఘనపరచబడాలో నిర్గమకాండము తెలియజేస్తుంది.
>
> — డా. రిచర్డ్ ఎల్. ప్రాట్ జు.

నిర్గమకాండము యొక్క గ్రంథకర్తృత్వము, సందర్భము మరియు వాస్తవిక అర్థమునకు సంబంధించిన కొన్ని ఆరంభ పరిగణలను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు ఆధునిక అనువర్తనము మీద కొన్ని వ్యాఖ్యలు చేద్దాము. నేటి క్రీస్తు అనుచరులకు ఈ పుస్తకము ఏ విధంగా అనువర్తించబడాలి?

## ఆధునిక అనువర్తనము

నిర్గమకాండము వంటి క్లిష్టమైన పుస్తకమును ఆధునిక జీవితమునకు లెక్కలేనన్ని విధములుగా అనువర్తించవచ్చు. ప్రతి వ్యక్తి ప్రత్యేకమైనవాడు మరియు వేర్వేరు పరిస్థితులను ఎదుర్కొంటాడు కాబట్టి ఇది మనకు తెలుసు. మరియు ఆధునిక అనువర్తనమును మరింత శ్రద్ధగా ఈ పాఠంలో తరువాత మనము చూద్దాము. కాని ఇప్పుడు, నిర్గమకాండమును మన జీవితములకు అనువర్తించుకొనుచుండగా మనము మనస్సులో ఉంచుకోవలసిన కొన్ని సాధారణ దృక్పథములను గుర్తించుట సహాయకరముగా ఉంటుంది.

నిర్గమకాండము దేవుని వాక్యమైయున్నది గనుక అది మనకు అనువర్తించబడుతుంది అని క్రీస్తు అనుచరులముగా మనకు తెలుసు. అయితే మనకు, వాస్తవిక శ్రోతలకు మధ్య కొన్ని ప్రాముఖ్యమైన భిన్నత్వములు ఉన్నాయి. ఈ కారణము చేత, ఆధునిక అనువర్తనములో మనలను నడిపించుటకు మనము ఎల్లప్పుడు క్రొత్త నిబంధనను ఆశ్రయించాలి. నిర్గమకాండమును గూర్చి సుమారుగా రెండు వందల నలభైసార్లు ప్రస్తావించుట ద్వారా క్రొత్త నిబంధన మనకు మార్గదర్శకత్వమును ఇస్తుంది. అయితే ఒక క్రొత్త నిబంధన వాక్యభాగము మాత్రం విశేషముగా సహాయపడుతుంది. 1 కొరింథీ. 10:1-5లో అపొస్తలుడైన పౌలు పలికిన ఈ మాటలను వినండి:

> మన పితరులందరు మేఘముక్రింద నుండిరి. వారందరును సముద్రములో నడచిపోయిరి; అందరును మోషేను బట్టి మేఘములోను సముద్రములోను బాప్తిస్మము పొందిరి; అందరు ఆత్మ సంబంధమైన ఒకే ఆహారమును భుజించిరి; అందరు ఆత్మ సంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధమైన బండలోనిది త్రాగిరి; ఆ బండ క్రీస్తే. అయితే వారిలో ఎక్కువమంది దేవునికిష్టులుగా ఉండకపోయిరి గనుక అరణ్యములో సంహరింపబడిరి (1 కొరింథీ. 10:1-5).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇక్కడ మనము చూచుచున్నట్లు, నిర్గమకాండములో నివేదించబడిన అనేక సన్నివేశములను పౌలు ప్రస్తావించాడు. అయితే ఈ లేఖన భాగము కొనసాగుచుండగా, 1 కొరింథీ. 10:11లోని మాటలను వినండి:

> **ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను (1 కొరింథీ. 10:11)**

ఈ వచనములు కలిసి, క్రీస్తు అనుచరుల కొరకు నిర్గమకాండము యొక్క ఔచిత్యమును స్పష్టముగా ఉద్ఘాటిస్తున్నాయి. "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించినవి" అని పౌలు చెబుతున్నాడు. మరియు అవి "మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను." నిర్గమకాండము "*ఆ* లోకము" కొరకు మాత్రమే, లేక "*వారి* లోకము" కొరకు మాత్రమే వ్రాయబడలేదుగాని "*మన* లోకము" కొరకు కూడా వ్రాయబడినది అని చూచుటలో పౌలు మాటలు సహాయం చేస్తాయి. దీనిని ఈ పాఠం యొక్క పదములలో వివరించినట్లయితే, నిర్గమకాండము కేవలం దాని యొక్క వాస్తవిక శ్రోతలను నడిపించుట కొరకు మాత్రమే వ్రాయబడలేదు. అది క్రీస్తు అనుచరులమైన "*మన* కొరకు" కూడా వ్రాయబడింది.

క్రీస్తు అనుచరుల లోకమును అపొస్తలుడు ఏ విధంగా వర్ణించాడో వినండి. మనము "యుగాంతమందున్నాము." "అంతము" అను మాట గ్రీకు పదమైన *τέλος* (టెలోస్) నుండి అనువదించబడింది, అనగా "ముగింపు" లేక "లక్ష్యము" అని అర్థము. చరిత్ర కొరకు దేవుడు కలిగియున్న ప్రణాళిక ముగింపుకు లేక లక్ష్యముకు చేరు కాలములో క్రైస్తవులు జీవించుచున్నారు. సామాన్య వేదాంతశాస్త్ర పదములలో, క్రీస్తును అనుసరించు మనము చరిత్ర యొక్క "అంత్య" లేక "చివరి" యుగములో జీవించుచున్నాము.

పౌలు మనస్సులో ఏమున్నదో అర్థము చేసుకొనుటకు, క్రీస్తులో రక్షించు విశ్వాసములోనికి మనము వచ్చినప్పుడు, మనము ఒక ప్రయాణములో భాగమవుతామని మనము గ్రహించాలి. వాస్తవానికి మనము మోషే యొక్క "చివరి దినముల"లోకి మరియు ఐగుప్తులో బానిసత్వము మరియు దౌర్జన్యము నుండి దేవుని వాగ్దాన దేశములోని ఆశీర్వాదములు మరియు స్వాతంత్ర్యములోనికి ప్రవేశించిన ఇశ్రాయేలు యొక్క ప్రయాణములోనికి ప్రవేశించుచున్నాము.

క్రొత్త నిబంధన అంతా అంత్య యుగము, లేక క్రీస్తులో చివరి దినములు, మూడు ముఖ్యమైన దశలలో ప్రత్యక్షమవుతాయని బోధిస్తుంది. కాబట్టి, బైబిలు దృష్టికోణములో నుండి, మోషే జీవితములోని ఈ చివరి దశ మరియు ఇశ్రాయేలీయుల ప్రయాణము క్రీస్తు తన భూలోక పరిచర్యలో చేసిన తన రాజ్యము యొక్క ఆవిష్కృతముతో ఆరంభమవుతుంది. సంఘ చరిత్ర అంతటా ఆయన రాజ్యము యొక్క కొనసాగింపులో క్రీస్తుతో ఐక్యత కలిగి మనము జీవించుచుండగా నిర్గమకాండములోని మోషే మరియు ఇశ్రాయేలు యొక్క ప్రయాణము ఈ అంత్య దినములలో ముందుకు కొనసాగుతుంది. మరియు చివరిగా, మోషే మరియు ఇశ్రాయేలు వాగ్దాన దేశమునకు ప్రయాణించిన విధముగానే, ఆయన మహిమలో తిరిగి వచ్చి, క్రొత్త ఆకాశములు మరియు క్రొత్త భూమిలోనికి మనలను తీసుకొనివెళ్లినప్పుడు ఆయన రాజ్యము యొక్క నెరవేర్పులో క్రీస్తుతో మన ప్రయాణములోని చివరి దినములు ముగించబడతాయి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

కాబట్టి, 1 కొరింథీ. 10 సూచించుచున్నట్లు, నిర్గమకాండములోని ప్రతి అంశమును మనము క్రీస్తులో అంత్య దినముల యొక్క ఆవిష్కృతము, కొనసాగింపు మరియు నెరవేర్పుల వెలుగులో ఆధునిక క్రైస్తవులకు అనువర్తించాలి.

మనము ఈ సంబంధములను అనేక విధములుగా చేయవచ్చు. ఉదాహరణకు, ఇశ్రాయేలు మోషే ద్వారా సీనాయి పర్వతము యొద్ద దేవునితో నిబంధన చేసింది అని నిర్గమకాండము మనకు బోధిస్తుంది. ఇదే విధముగా, క్రైస్తవులు క్రీస్తులో క్రొత్త నిబంధనలోనికి ప్రవేశిస్తారు. అయితే ఈ క్రొత్త నిబంధన క్రీస్తు యొక్క మొదటి రాకడతో ఆరంభమైయ్యింది; అది ఇప్పుడు కొనసాగుతుంది; మరియు అది క్రీస్తు యొక్క రెండవ రాకడలో సంపూర్ణమవుతుంది.

మరొక ఉదాహరణగా, మోషే దినములలో మందిరములో ఉండిన దేవుని సన్నిధిని గూర్చి నిర్గమకాండము నివేదిస్తుంది. దేవుని సన్నిధి క్రీస్తులో మరిఎక్కువగా ఉన్నదని క్రొత్త నిబంధన బోధిస్తుంది. యేసు స్వయముగా రాజ్యము యొక్క ఆవిష్కృతములో మన మధ్యలో నివసించిన దేవుని సన్నిధి అయ్యున్నాడు. రాజ్యము యొక్క కొనసాగింపులో, పరిశుద్ధాత్మ వ్యక్తిగత విశ్వాసిలోను మరియు సామూహిక సంఘములోను నివసిస్తాడు. మరియు రాజ్యము యొక్క నెరవేర్పులో, క్రొత్త సృష్టి ఆయన పరిశుద్ధమైన సన్నిధిగా మారినప్పుడు దేవుని మహిమ సమస్తమును కప్పుతుంది.

మోషే దినములలో దేవుడు తన విరోధులను జయించిన విషయమును కూడా నిర్గమకాండము బయలుపరుస్తుంది. క్రీస్తు పాపమును మరియు మరణమును ఓడించాడని క్రొత్త నిబంధన బోధిస్తుంది. క్రీస్తు తన మొదటి రాకడలో దేవుని యొక్క బలమైన యుద్ధ వీరునిగా ఈ ఓటమి యొక్క అంతిమ దశలను ఆరంభించాడు. ఆత్మీయ యుద్ధములో సర్వాంగ కవచమును ధరించుకొనుట ద్వారా క్రీస్తు యొక్క సైన్యముగా సంఘము ఆయనను అనుసరిస్తుంది. మరియు ఆయన మహిమలో తిరిగివచ్చునప్పుడు, దేవుని విరోధుల మీద ఆయన చేస్తున్న గొప్ప సార్వత్రిక యుద్ధమును ఆయన పూర్తి చేస్తాడు.

అంతేగాక, నిర్గమకాండములో, వాగ్దాన దేశములో దేవుడు వారికి ఇవ్వబోవు స్వాస్థ్యమును పొందుకొనుటకు ఇశ్రాయేలీయులు ప్రయాణించారు. దేవుని పరిపాలనను భూమియందంతటా వ్యాపింపజేయుటకు వారు తీసుకున్న మొదటి అడుగు ఇది. క్రైస్తవులు తమ స్వాస్థ్యమును క్రీస్తులో పొందుకుంటారని క్రొత్త నిబంధన బోధిస్తుంది. తన రాజ్యము యొక్క ఆవిష్కృతములో క్రీస్తు స్వయంగా తన స్వాస్థ్యమును భద్రపరచాడు. క్రైస్తవులముగా నేడు మనము పరిశుద్ధాత్మ ద్వారా మనకు ఇవ్వబడిన స్వాస్థ్యమును ఆస్వాదించుట కొనసాగించుచున్నాము. మరియు క్రీస్తు తిరిగివచ్చినప్పుడు, ఆయన — మరియు ఆయనలో మనము — సమస్తమును స్వాధీనపరచుకుంటాము.

మోషే యొక్క నిలిచియుండు అధికారము మీద నిర్గమకాండము పెట్టిన ప్రాముఖ్యమైన దృష్టి క్రీస్తులో నేడు మనకు కూడా అనువర్తించబడుతుంది అని ఇవి మరియు అనేక ఇతర విశాలమైన సంబంధములు స్పష్టము చేస్తాయి. క్లుప్తంగా, దేవుడు వారి దినములలో చేయుచుండిన కార్యముల వెలుగులో మోషే యొక్క అధికారమునకు నమ్మకముగా నిలిచియుండమని నిర్గమకాండము దాని యొక్క వాస్తవిక శ్రోతలకు పిలుపునిచ్చింది. మరియు క్రీస్తులో దేవుడు సాధించిన, సాధించుచున్న మరియు సాధించబోవుచున్న వాటి వెలుగులో మోషే యొక్క అధికారమునకు నమ్మకముగా ఉండమని ఇప్పుడు నిర్గమకాండము మనకు పిలుపునిస్తుంది.

నిర్గమకాండము యొక్క కొన్ని ఆరంభ పరిగణలను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు ఈ పాఠం యొక్క రెండవ ప్రధానమైన అంశమును మనము చూద్దాము: ఈ పుస్తకము యొక్క నిర్మాణము మరియు విషయములు.

## నిర్మాణము & విషయములు

నిర్గమకాండములో నలభై అధ్యాయములు ఉన్నాయి మరియు వీటిలో అనేకమంది పాత్రలు, అనేక సందర్భములు మరియు సన్నివేశములు ఉన్నాయి. కథనము, పాట, వంశావళి, పట్టిక, నియమములు, ఉపన్యాసములు, ప్రార్థనలు మరియు ఉపదేశముల వంటి అనేక రకముల సాహిత్య రకములు దీనిలో మనము చూస్తాము. మరియు ఈ క్లిష్టతల వలన ఈ పుస్తములోని ముఖ్యమైన విభజనలను, భాగములను మరియు చిన్న చిన్న ముక్కలను నిర్ధారించుట కొన్నిసార్లు కష్టమవుతుంది. కాబట్టి, నిర్గమకాండమునకు అనేక రకములుగా ఆకారమును ఇవ్వవచ్చని చెప్పుట సబబే అవుతుంది. కాని పుస్తకము యొక్క వాస్తవిక ఉద్దేశ్యమును మనము జ్ఞాపకముంచుకున్నప్పుడు, ఈ పుస్తకము యొక్క సామాన్య నిర్మాణము మరియు విషయములను కనుగొనుట అంత కష్టమనిపించదు.

నిర్గమకాండములో రెండు ప్రధానమైన విభజనలు ఉన్నాయి. 1:1-18:27లో ఉన్న మొదటి భాగము, మోషే మరియు ఐగుప్తు నుండి సీనాయి పర్వతము వరకు ఇశ్రాయేలు యొక్క విమోచన మీద దృష్టిపెడుతుంది. 19:1-40:38లో ఉన్న రెండవ భాగము, సీనాయి పర్వతము యొద్ద కనానులో ప్రవేశించుటకు మోషే మరియు ఇశ్రాయేలు చేసిన సిద్ధపాటు మీద దృష్టిపెడుతుంది.

ఈ రెండు ముఖ్యమైన విభజనలు నిర్గమనము తరువాత రెండవ తరము వారి మీద మోషే కలిగియుండిన నిలిచియుండు అధికారము మీద ఏ విధంగా దృష్టిపెట్టాయో విశేషముగా చూద్దాము. మోషే మరియు ఐగుప్తు నుండి సీనాయి పర్వతము వరకు ఇశ్రాయేలు యొక్క విమోచనను చూస్తూ ఆరంభిద్దాము.

## ఐగుప్తు నుండి విమోచన (నిర్గమ. 1:1-18:27)

మోషే మరియు ఐగుప్తు నుండి ఇశ్రాయేలు యొక్క విమోచన, ఇశ్రాయేలు విమోచన పొందుటకు *ముందు* వారి మీద మోషే కలిగియుండిన అధికారము మీద దృష్టిపెడుతూ ఆరంభమవుతుంది. నిర్గమ. 1:1-4:31లో మనము దీనిని చూస్తాము. తరువాత, 5:1-18:27లో, ఇశ్రాయేలుకు విమోచన *కలిగిన* సమయములో జరిగిన సన్నివేశముల మీద మోషే దృష్టిపెడతాడు. ఇశ్రాయేలు యొక్క విమోచనకు ముందు జరిగిన సన్నివేశములను గూర్చి నిర్గమకాండము ఏమి బోధిస్తుందో చూస్తూ ఆరంభిద్దాము.

### విమోచనకు ముందు (1:1-4:31)

ఇశ్రాయేలు యొక్క విమోచనకు ముందు జరిగిన సన్నివేశములను రెండు భాగములుగా విభాగించవచ్చు. మొదటిగా, మోషే జననము మరియు పెంపకం 1:1లో ఆరంభమై 2:10 వరకు

కొనసాగుతుంది. దీని తరువాత, 2:11-4:31లో ఇశ్రాయేలు మీద నాయకునిగా మోషే ఎలా ఎదిగాడో మనము నేర్చుకుంటాము. మోషే జననము మరియు పెంపకమును గూర్చిన వృత్తాంతముతో ఆరంభిద్దాము.

జననము మరియు పెంపకం (1:1-2:10). మోషే తన బాల్యమును ఐగుప్తు కోటలలో గడుపుట వలన మోషే అధికారమునకు విరోధముగా తలెత్తిన ప్రతి విధమైన అభ్యంతరములకు ఈ వచనములు స్పందించాయి. వృత్తాంతము యొక్క ఆరంభములో, ఇశ్రాయేలీయుల సంఖ్య పెరుగుట వలన వారు ఎదురుతిరిగే అవకాశం ఉందని ఫరో బయపడ్డాడు. ఇశ్రాయేలు యొక్క జనాభాను అదుపుచేయుటకు అతడు మూడు కుయుక్తితో కూడిన పన్నాగములు వేశాడు. కఠినమైన వెట్టి చాకిరి చేయించుటకు అతడు చేసిన ప్రయత్నము విఫలమైయ్యింది. ఇశ్రాయేలీయ బాలురను జననమందే హతమార్చమని అతడు మంత్రసానులకు ఇచ్చిన ఆజ్ఞ కూడా విఫలమైయ్యింది. అన్నిటి కంటే ముఖ్యముగా, ఇశ్రాయేలీయ బాలురను నైలు నదిలో ముంచివేయమని అతడు ఇచ్చిన ఆజ్ఞ కూడా విఫలమైయ్యింది.

ఈ ఉపాఖ్యానములన్నిటిలో, వక్రోక్తి కనిపిస్తుంది. అయితే మోషేను నైలు నదిలో నుండి రక్షించుట ద్వారా స్వయంగా ఫరో కుమార్తె అతని చివరి ప్రణాళికను భంగము చేయుటలో అతి పెద్ద వక్రోక్తి కనిపిస్తుంది. తరువాత 2:10లో, "నీటిలో నుండి ఇతని తీసితినని చెప్పి" ఫరో కుమార్తె మోషేకు ఈ పేరును పెట్టింది. ఇప్పుడు, ఐగుప్తీయుల భాషలో, "మోషే" అనగా "కుమారుడు" అని అర్థము, మరియు ఇది మోషే రాజ వంశమునకు చెందినవాడు అని అనేకమందికి సూచించింది. కాని ఆ బాలునికి మోషే అను పేరు హెబ్రీ క్రియా పదమైన *משׁה* (మషహ్) వలె అనిపించింది కాబట్టి ఆ బాలునికి ఆ పేరు పెట్టినట్లు ఫరో కుమార్తె స్పష్టముగా వివరించింది. కాబట్టి, నమ్మకమైన ఇశ్రాయేలీయుల చెవులకు, మోషే అను పేరు అతడు ఫరో కుమారుడని సూచించలేదు. బదులుగా, మోషే అను పేరు తమకు హాని చేయుటకు ఫరో చేసిన యత్నములు విఫలమైయ్యాయి అని ఇశ్రాయేలుకు జ్ఞాపకము చేస్తు ఫరోను గేలి చేసింది.

నాయకత్వమునకు ఎదుగుట (2:11–4:31). ఐగుప్తు నుండి ఇశ్రాయేలు యొక్క విమోచనకు ముందు జరిగిన సన్నివేశములను గూర్చిన కథనము మోషే జననము మరియు పెంపకము మీద నుండి 2:11-4:31లో ఇశ్రాయేలుకు నాయకునిగా మోషే ఎదుగుటకు సంబంధించిన ప్రశ్నల మీదికి కొనసాగుతుంది.

నిర్గమ. 2:14లో, ఒక ఇశ్రాయేలీయ బానిస మోషేను నిలదీసి ఇలా ప్రశ్నించాడు, "మామీద నిన్ను అధికారినిగాను తీర్పరినిగాను నియమించినవాడెవడు?" మోషే ఇశ్రాయేలు యొక్క అధికారిక నాయకునిగా ఎలా అయ్యాడో వివరించుట ద్వారా ఈ ప్రశ్నకు జావబిచ్చుట కొరకు ఈ భాగం అంతా అంకితం చేయబడింది. ఇశ్రాయేలీయుడు అడిగిన ప్రశ్నకు సమాధానం ఆరు-దశల ఖయాజం ద్వారా, అనగా మునుపటి భాగము మరియు తరువాత భాగము ఒకదానికొకటి సమాంతరముగా ఉండు లేక సమతుల్యమును చేసుకొను సాహిత్య నిర్మాణము ద్వారా ప్రత్యక్షమవుతుంది.

మొదటిగా, నిర్గమ. 2:1-15లో మోషే ఐగుప్తు నుండి పారిపోవుట, ఇశ్రాయేలీయ బానిసను కాపాడుటకు అతడు ఐగుప్తీయుని చంపి ఐగుప్తు నుండి పారిపోయాడు అని వివరిస్తు మోషే ఇశ్రాయేలు యొక్క నాయకుడైయున్నాడని సమర్థిస్తుంది.

రెండవదిగా, 2:16-22లో మోషే మిద్యానీయుల కుటుంబములో కలిసిపోతాడు. మోషేకు పుట్టిన కుమారుని పేరు గెర్షోము అని 22వ వచనము తెలియజేస్తుంది. ఈ వాక్యభాగము వివరించుచున్న

విధముగా, ఈ పేరు ఒక హెబ్రీ వ్యక్తీకరణమైన *גֵּר שָׁם*(గెర్ షమ్) వలె వినిపిస్తుంది, మరియు “అక్కడ ఒక పరదేశి” అని దీనికి అర్థము. మిద్యానీయుల మధ్య మోషే తననుతాను ఒక పరదేశి వలె భావించుకునేవాడని ఈ పేరు సూచిస్తుంది. మరొక మాటలో, అతడు తన నిజమైన ఇశ్రాయేలీయ గుర్తింపును ఏనాడు కోల్పోలేదు.

నిర్గమ. 2:23-25లో ఉన్న మూడవ భాగము, దేవుడు తన నిబంధనను జ్ఞాపకము చేసుకొనుటను గూర్చి మాట్లాడుతుంది. ఈ భాగంలో, ఇశ్రాయేలీయులు సహాయం కొరకు కేకలు వేశారు, మరియు ఇశ్రాయేలు పితరులకు చేసిన వాగ్దానమును జ్ఞాపకము చేసుకొనుట ద్వారా దేవుడు స్పందించాడు.

నాల్గవ భాగము ఇంతకు ముందు భాగముతో సంబంధము కలిగియుంటుంది. 3:1-4:17లో ఉన్న వచనములు మండుచున్న పొద యొద్ద దేవుడు మోషేకు ఇచ్చిన ఆజ్ఞను గూర్చి మాట్లాడతాయి. ఇక్కడ, ఇశ్రాయేలును ఐగుప్తు నుండి బయటకు తీసుకొని వచ్చి, వాగ్దాన భూమిలోనికి వారిని నడిపించుటకుగాను మోషేను పిలచుట ద్వారా దేవుడు ఇశ్రాయేలు పితరులతో చేసిన నిబంధనను జ్ఞాపకము చేసుకున్నాడు అను సత్యము మోషే యొక్క నాయకత్వమును సమర్థించింది.

నిర్గమ. 4:18-26లోని ఐదవ భాగము, మిద్యానులో తన కుటుంబముతో మోషే గడిపిన రెండవ భాగమునకు సంబంధించినది. ఈ భాగము మోషే తన మిద్యానీయ కుటుంబమును విడచి వెళ్లుటను వర్ణిస్తుంది. మోషే గెర్షోముకు సున్నతి చేయుటలో విఫలమయ్యాడు కాబట్టి, ఈ భాగము మరొకసారి అతని మీద దృష్టిపెడుతుంది. ఈ భాగములో, ఆది. 17:10-14లో దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధనను అనుసరించి ఆయన మోషేను హతమార్చగోరాడు. అయితే ఈ సన్నివేశము కూడా మోషే నాయకత్వమునకు దేవుడు చూపిన సమర్థనను కనుపరుస్తుంది. మోషే యొక్క మిద్యానీయురాలైన భార్య అయిన సిప్పోరా గెర్షోముకు సున్నతి చేసినప్పుడు దేవుడు కనికరమును చూపాడు కాబట్టి ఇది మనకు తెలుసు.

చివరిగా, ఐగుప్తు నుండి ఆరంభములో మోషే పారిపోయిన విషయమును సమతుల్యము చేస్తు, అహరోనుతో కలిసి మోషే ఐగుప్తునకు తిరిగివచ్చుటను గూర్చి నిర్గమ. 4:27-31 నివేదిస్తుంది. మోషే నాయకత్వమును అధిరోహించుట ఇక్కడ కూడా సమర్థించబడింది. దేవుడు వారి యొద్దకు మోషేను పంపాడు కాబట్టి ఇశ్రాయేలీయులు దేవుని నమ్మి, ఆయనను ఆరాధించారు అని 4:31లో మనము నేర్చుకుంటాము.

> మనమంతా కథలను చెప్పు విధముగా, ఇంకా ఎవరైనా కథలను చెప్పు విధముగా, ఒక ఆరంభము మరియు ముగింపు ఉన్నాయి, పరిచయం ఉంది, మలుపు ఉంది, ముగింపు కూడా ఉంది, మరియు ఇదంతా సౌష్టవముగా ఉన్నది... కాబట్టి, బైబిలు కథనములలో ఇట్టి సౌష్టవ నిర్మాణమును చూసినప్పుడు మనము ఆశ్చర్యపడకూడదు. వాస్తవానికి, బైబిలు కథనములలో మనము దీనినే కనుగొంటాము. బైబిలు కథకులు మరియు వ్యాఖ్యానకర్తలు తమ సాహిత్యమును కల్పించుట లేదు. కళాత్మకముగా ఈ విధముగా పని చేయునట్లు వారు తమ సాహిత్యమును కల్పించుట లేదు; ఇది మనము కథలను చెప్పు విధానము అంతే మరియు దీనిని మనము ఎదుర్కోవాలి. ఒక కథనము ఏ విధంగా పని చేస్తుందో



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> తెలుసుకొనుట ద్వారా ఏమి జరిగుతుందో మరియు దేని కొరకు ఎదురుచూడాలో మనము తెలుసుకొనగలుగుతాము.
>
> — డా. గోర్డన్ హెచ్. జాన్సన్

ఇశ్రాయేలు యొక్క విమోచనకు ముందు కాలములో మోషే మరియు ఐగుప్తు నుండి ఇశ్రాయేలు యొక్క విమోచనను గూర్చి ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు నిర్గమ. 5:1-18:27లో ఇశ్రాయేలు యొక్క విమోచన కాలములో మోషే చేసిన కార్యములను మనము చూడవలసియున్నాము.

## విమోచన కాలములో (5:1-18:27)

ఇశ్రాయేలు యొక్క విమోచన కాలములో మోషే చేసిన కార్యములు ఐగుప్తులో అతడు గడిపిన సమయముతో ఆరంభమవుతాయి, మరియు దీనిని గూర్చి నిర్గమ. 5:1-13:16లో వ్రాయబడియున్నది. దీని తరువాత, నిర్గమ. 13:17-18:27లో ఐగుప్తు నుండి సీనాయి పర్వతము యొద్దకు చేసిన ప్రయాణములో మోషే యొక్క నాయకత్వమును గూర్చి మనము నేర్చుకుంటాము. ఐగుప్తులో మోషే కాలమును చూస్తూ ఆరంభిద్దాము.

ఐగుప్తులో (5:1—13:16). ఐగుప్తులో అతడు ఇంతకు ముందు చేసిన ప్రయత్నములు ఇశ్రాయేలీయులు మరింత శ్రమపడుటకు దోహదపడ్డాయి కాబట్టి ఐగుప్తులో మోషే గడిపిన సమయము మోషేకు విరోధముగా తలెత్తిన అభ్యంతరములకు జవాబులను ఇచ్చియుంటుంది.

5:1-6:27లో, మోషే నాయకత్వమును ఇశ్రాయేలు తిరస్కరించుట, మోషే విలపించుట, మరియు దేవుడు నిశ్చయతనిచ్చుట అను విషయములను కలిగియున్న రెండు సమాంతర క్రమములను మనము చదువుతాము. మొదటి క్రమము 5:1-6:8లో కనిపిస్తుంది. తమకు విరోధముగా నిలచునట్లు ఫరోకు కోపము పుట్టించుట వలన ఇశ్రాయేలీయులు మోషేను తిరస్కరించారు. మోషే వినయముతో విలపించాడు. మరియు ఇశ్రాయేలుకు నాయకత్వము వహించుటకు అతనికి ఇవ్వబడిన పిలుపును గూర్చి దేవుడు అతనికి నిశ్చయతను కలిగించాడు.

6:9-27లో ఉన్న రెండవ క్రమము కూడా, ఇదే పద్ధతిని అనుసరిస్తుంది. అయితే ఇశ్రాయేలు మోషేను రెండవసారి తిరస్కరించిన తరువాత, మరియు మోషే రెండవసారి విలపించిన తరువాత, ఒక వంశావళి రూపములో దేవుని యొక్క నిశ్చయత కలుగుతుంది. 6:13-27 మోషే మరియు అహరోను యొక్క వంశమును తమ పితరుడైన లేవీ నుండి ఆరంభించి అహరోను మనుమడైన ఫీనెహాసు వరకు తెలియజేస్తుంది. అవును, లేవీ పన్నెండుమంది ఇశ్రాయేలు పితరులలో ఒకడైయున్నాడు. మరియు, సంఖ్యాకాండము 25 మరియు 31 ప్రకారం, ఫీనెహాసు రెండవ తరమువారి దినములలో ఇశ్రాయేలీయులను దేవునికి నమ్మకమైన సేవచేయుటలోనికి నడిపించాడు. మోషే మరియు అహరోనులు యాకోబు యొక్క గోత్రముల నుండి వచ్చిన నిజమైన ఇశ్రాయేలీయులని దేవుడు ఇక్కడ రెండవ తరమువారికి నిశ్చయతనిచ్చాడు. మరియు ఫీనెహాసులో, మోషే అహరోనుల నమ్మకమైన వారసత్వమును చూడగలిగారు మరియు వారిని నడిపించుటకు దేవుడు వీరిని పిలచాడను నిశ్చయతను కలిగియుండగలిగారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇది మనలను ఐగుప్తులో మోషే చేసిన కార్యములలోని రెండవ ముఖ్య భాగములోనికి నడిపిస్తుంది: నిర్గమ. 6:28-13:16లో దేవుడు ఐగుప్తునకు తీర్చిన ఆశ్చర్యకరమైన తీర్పులు. ఐగుప్తీయులకు విరోధముగా దేవుడు తెచ్చిన అసాధారణమైన తీర్పు కార్యములలో మోషే పోషించిన ముఖ్యమైన పాత్రను చూపుట ద్వారా ఈ అధ్యాయములు మోషే యొక్క అధికారమును నిర్ధారిస్తాయి.

సర్పములకు సంబధించిన పరిచయ తీర్పు 6:28-7:13లో కనిపిస్తుంది. అహరోను కర్ర అద్భుతముగా ఒక సర్పము వలె మారిపోయింది మరియు ఫరో యొక్క శకునగాండ్రు చేసిన పాములను మింగివేయుట ద్వారా ఐగుప్తు మీద దేవుని శక్తిని కనుపరచింది. ఈ పరిచయ ఆశ్చర్యకార్యము తరువాత, నిర్గమ. 7:14-10:29లో తొమ్మిది తీర్పుల వరుస కనిపిస్తుంది. ఈ తొమ్మిది తీర్పులు మూడు క్రమములుగా సమానముగా విభజించబడతాయి, మరియు ప్రతి ఒక్కటి నైలు నది వద్ద మోషే ఫరోను ఎదుర్కొనుటతో ఆరంభమవుతాయి.

మొదటి క్రమము 7:14-8:19లో ఉన్నది. దీనిలో నీరు రక్తముగా మార్చబడుట, కప్పలు దేశమును నింపుట, మరియు ధూళిలో నుండి పేలు వచ్చుట వంటి ఆశ్చర్యకార్యములు ఉన్నాయి. రెండవ క్రమము 8:20-9:12లో ఉన్నది మరియు దీనిలో ఈగల తెగులు, ఐగుప్తీయుల పశువుల మీద తెగులు, మరియు దద్దురుల తెగులు ఉన్నాయి. మూడవ క్రమము 9:13-10:29లో ఉన్నది. దీనిలో వడగండ్లు, మిడతలు మరియు చీకటికి సంబంధించిన తీర్పులు ఉన్నాయి. ఈ ఆశ్చర్యకరమైన తీర్పులన్నిటిలో మోషే పోషించిన కీలకమైన పాత్ర ఇశ్రాయేలు యొక్క నాయకునిగా అతని అధికారమును నిర్ధారించినది. చివరిగా, పస్కా తీర్పు 11:1-13:6లో ఈ భాగమును ముగిస్తుంది. ఐగుప్తులోని జ్యేష్టులనందరినీ దేవుడు హతము చేసిన తరువాత, ఫరో ఇశ్రాయేలుకు వెళ్లుటకు అనుమతినిచ్చాడు.

ఐగుప్తులో జరిగిన ఇశ్రాయేలు యొక్క విమోచన కాలములోని సన్నివేశములను చూశాము కాబట్టి, నిర్గమ. 13:17-18:27లో ఐగుప్తు నుండి సీనాయి పర్వతము వరకు చేసిన ప్రయాణములో దేవుడు మోషే యొక్క అధికారమును సమర్థించిన విధానములను మనము ఇప్పుడు చూడవలసియున్నది.

**ప్రయాణములో (13:17-18:27).** సీనాయి పర్వతము యొద్దకు ఇశ్రాయేలు చేసిన ప్రయాణములో వారు సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ, ఇశ్రాయేలు సిద్ధపాటు లేకుండా ఐగుప్తును విడిచిపెట్టలేదని గుర్తించుట చాలా ప్రాముఖ్యమైయున్నది. "యుద్ధమునకు సిద్ధపడి" ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడచారని నిర్గమ. 13:18 చాలా స్పష్టముగా మనకు తెలియజేస్తుంది. ఈ సైన్య ఆలోచనలో, ఈ భాగమంతటిలో ఇతర దేశములతో యుద్ధము మరియు ఇశ్రాయేలీయుల సైన్యము నీటి కొరకు, ఆహారము కొరకు తాపత్రయపడుటను మనము చూస్తాము.

యుద్ధమునకు సిద్ధపడి ఇశ్రాయేలు చేసిన ప్రయాణము నాలుగు ప్రధానమైన భాగములుగా విభజించబడుతుంది. 13:17-15:21లో ఉన్న మొదటి భాగము సముద్రము యొద్ద మోషే అధికారము యొక్క సమర్థనతో వ్యవహరిస్తుంది. నిర్గమ. 14:31లో, ఇశ్రాయేలు ఆరిన నేల మీద సముద్రమును దాటిన తరువాత, మోషే యొక్క సమర్థనను గూర్చి మనము ఈ విధంగా చదువుతాము:

> **ప్రజలు యెహోవాకు భయపడి యెహోవాయందును ఆయన సేవకుడైన మోషేయందును నమ్మకముంచిరి (నిర్గమ. 14:31).**



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ వచనము ఈ భాగములోని ముఖ్య బిందువులను బలవంతముగా తెలియపరుస్తుంది. ఇశ్రాయేలు సైన్యము "యెహోవాకు భయపడి ఆయనయందు నమ్మకముంచిరి." *మరియు* వారు "ఆయన సేవకుడైన మోషేను" కూడా నమ్మారు. అవును, నిర్గమకాండము యొక్క వాస్తవిక శ్రోతలకు ఈ సందేశము చాలా స్పష్టముగా ఉన్నది. వారు కూడా తమ దినములలో దేవుని మరియు మోషేను నమ్మవలసియుండెను.

దీని తరువాత, 15:22-27లో ఇశ్రాయేలు సైన్యము షూరు అరణ్యములోనికి ప్రయాణము చేసింది. షూరు అరణ్యములో, మోషే కనుగొనిన నీరు త్రాగుటకు తగినవి కావు గనుక సణుగుట ద్వారా ప్రజలు మోషే యొక్క అధికారమును సవాల్ చేశారు. కాబట్టి, నీటిని బాగుచేయుటకు ఒక చిన్న చెక్క ముక్కను ఇచ్చుట ద్వారా దేవుడు ఇశ్రాయేలు యొక్క నాయకునిగా మోషేను ఘనపరచాడు.

మూడవ భాగములో, 16:1-36లో ఇశ్రాయేలీయులు సీను అరణ్యములోనికి ప్రవేశించారు. సీను అరణ్యములో, మోషే అహరోనుల మీద సణుగుట ద్వారా ఇశ్రాయేలీయులు మరొకసారి మోషే నాయకత్వమును సవాల్ చేశారు. కాని ఈ సారి, 7వ వచనములో, వారు *దేవునికి* విరోధముగా సణుగుచున్నారని మోషే తెలియజేశాడు. మరియు ఇశ్రాయేలుకు ఆహారముగా పూరేళ్లను ఇచ్చుట ద్వారా, మరియు తరచుగా మన్నాను ఇచ్చుట ద్వారా దేవుడు మోషేను మరొకసారి సమర్థించాడు.

> అరణ్యములో ప్రజల యొక్క అవసరతలను తీర్చుట ద్వారా దేవుడు మోషే యొక్క అధికారమును ధృడపరచాడు. వారు మోషేకు విరోధముగాను, దేవునికి విరోధముగాను సణిగినప్పటికీ, దేవుడు కృపతో వారికి బండ నుండి నీటిని అనుగ్రహించాడు, పరలోకము నుండి మన్నాను కురిపించాడు, మరియు ఇదంతా వారి పట్ల ఆయన కలిగియుండిన తండ్రి ప్రేమ వలన మాత్రమే చేయలేదుగాని, ఆయన పంపిన వ్యక్తి నిజముగా మోషేనే అని నిర్ధారించుటకు కూడా చేశాడు... క్రైస్తవులముగా మనము చాలాసార్లు ఒక మనుష్యుని నమ్ముటను గూర్చి, మనిషి మీద విశ్వాసముంచుటను గూర్చి ఆలోచన చేస్తాము, కాని ఇక్కడ ప్రజలు దేవుని మీద మాత్రమేగాక, ఈ సందర్భములో దేవుని యొక్క పాత్రగా మరియు ప్రతినిధిగా ఉన్న మోషే మీద నమ్మికయుంచుటకు పిలువబడ్డారు. దీనిని మనము సముద్రము గుండా ప్రయాణించుచున్న ఐగుప్తు సైన్యముల మీద దేవుడు గొప్ప విజయమును పొందినప్పుడు యెర్ర సముద్రమునకు ఆవల కూడా చూశాము. సముద్రమునకు ఆవల, ప్రజలు సంతోషించి, దేవుని స్తుతించి దేవుని మీద మరియు మోషే మీద నమ్మికయుంచారు.
>
> — ప్రొఫెసర్. థామస్ ఎగ్గర్

నిర్గమ. 17:1-18:27లో ఇశ్రాయేలు ప్రయాణము చేసిన నాల్గవ మరియు చివరి స్థలము పేరు రెఫీదీము. ఈ విశాలమైన భాగము మూడు ఉపాఖ్యానములుగా విభాగించబడుతుంది. మొదటిగా, నిర్గమ. 17:1-7లో, నీటిని గూర్చి మరలా సణిగినప్పుడు ప్రజలు దేవుని పరీక్షించారు. దీనికి స్పందనగా, సీనాయి పర్వతము యొద్దకు తనతో కూడా పెద్దలను తీసుకొనివెళ్లమని దేవుడు మోషేను ఆజ్ఞాపించాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అక్కడ దేవుడు బండను కొట్టమని మోషేను హెచ్చరించగా, దానిలో నుండి నీరు బయటకు వచ్చాయి. అయితే, ఈ ఆశ్చర్యకార్యము తరువాత కూడా, ఇశ్రాయేలీయులు మరిఎక్కువగా దేవునితో వాదమాడారు. 7వ వచనములో "దేవుడు మన మధ్యలో ఉన్నాడో లేడో" అని వారు ఆశ్చయపోయారు. తరువాత రెండు ఉపాఖ్యానములు ఈ విషయమునకు జవాబిస్తాయి.

ఇప్పుడు, ఈ ఉపాఖ్యానములు ప్రశ్నకు జవాబును ఎలా ఇస్తాయో అర్థము చేసుకొనుటకు, ఇశ్రాయేలీయులకు బాగుగా తెలిసిన ఒక విషయమును మనము జ్ఞాపకము చేసుకోవాలి. ఆదికాండము 12:3లో, ఇశ్రాయేలును ఆశీర్వదించువారిని ఆయన ఆశీర్వదిస్తాడని మరియు శపించినవారిని శపిస్తాడని దేవుడు అబ్రాహాముతో వాగ్దానము చేశాడు. కాబట్టి, ఈ వాగ్దానమును అనుసరిస్తు, నిర్గమ. 17:8-16లో, అమాలేకీయులు ఇశ్రాయేలు మీద దాడి చేసినప్పుడు, దేవుడు వారిని ఓడించి అమాలేకీయులను శపించాడు.

తరువాత 18:1-27లో ఉన్న ఈ భాగము యొక్క ఆఖరి ఉపాఖ్యానములో, యిత్రో సమాధానముతో మోషే యొద్దకు వచ్చాడు. యిత్రో ఇశ్రాయేలీయులను ఆశీర్వదించాడు కాబట్టి, దేవుడు యిత్రోను ఆశీర్వదించాడు. ఆయన అబ్రాహాముకు వాగ్దానము చేసిన విధముగానే దేవుడు ఇశ్రాయేలీయులతో ఉన్నాడని ఈ రెండు సన్నివేశములు నిస్సందేహముగా తెలియపరచాయి. ఇశ్రాయేలు సైన్యము మోషేను అనుసరించిన విధముగానే, వారు దేవుని శక్తిగల సన్నిధి యొక్క భద్రతను పొందుకున్నారు.

ఇప్పటి వరకు, నిర్గమకాండము యొక్క నిర్మాణము మరియు విషయములు మోషే మరియు ఐగుప్తు నుండి సీనాయి పర్వతము వరకు ఇశ్రాయేలు యొక్క విమోచన మీద దృష్టిపెట్టుట ద్వారా మొదటిగా మోషే యొక్క అధికారముతో ఎలా వ్యవహరిస్తాయో మనము చూశాము. ఇప్పుడు నిర్గమ. 19:1-40:38లో ఉన్న ఈ పుస్తకము యొక్క రెండవ భాగమును మనము చూడవలసియున్నది. సీనాయి పర్వతము యొద్ద కనానులో ప్రవేశించుటకు మోషే మరియు ఇశ్రాయేలు చేసిన సిద్ధపాటును గూర్చి వివరించుట ద్వారా ఈ అధ్యాయములు మోషే యొక్క అధికారమును కనుపరుస్తాయి.

## కనాను కొరకు సిద్ధపాటు (నిర్గమ. 19:1-40:38)

సీనాయి పర్వతము యొద్ద మోషే మరియు ఇశ్రాయేలీయులు బస చేసినప్పుడు ఏమి జరిగిందో — దేవుడు వారికి ధర్మశాస్త్రమును మరియు తన మందిరమును ఎలా ఇచ్చాడో — ఇంచుమించు బైబిలు విద్యార్థులందరికీ తెలుసు. అయితే నిర్గమకాండము అక్కడ జరిగిన కొన్ని సన్నివేశములను గూర్చి మాత్రమే తెలియజేస్తుంది. ఆ సమయమందు జరిగిన అనేక ఇతర విషయాలను గూర్చి లేవీయకాండము మనకు చెబుతుంది కాబట్టి దీనిని గూర్చి మనకు తెలుసు. ఈ కారణం చేత, ఈ అధ్యాయములు ఎంతో ఎంపిక చేయబడి వ్రాయబడినవని మనకు తెలుసు. ఈ సన్నివేశముల మీద కొన్ని దృక్పథములను నొక్కి చెప్పడానికి ఇవి రూపొందించబడినవి. మరియు మనము తరువాత చూడబోవుచున్నట్లు, సీనాయి పర్వతము యొద్ద దేవుడు ఇశ్రాయేలు మీద మోషే యొక్క అధికారమును ఎలా కనుపరచాడో అను విషయము మీద దృష్టిపెడతాయి.

కనాను కొరకు మోషే మరియు ఇశ్రాయేలు యొక్క సిద్ధపాటు రెండు ప్రధానమైన భాగములుగా విభాగించబడుతుంది. మొదటి భాగము నిర్గమ. 19:1-24:11లో ప్రత్యక్షమవుతుంది మరియు ఇది మోషే



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అధికారము మరియు ఇశ్రాయేలు యొక్క నిబంధనను గూర్చి మాట్లాడుతుంది. 24:12-40:38లో ఉన్న రెండవ భాగము, మోషే అధికారమును మరియు ఇశ్రాయేలు యొక్క మందిరమును ఉద్ఘాటిస్తుంది. ఇశ్రాయేలు యొక్క నిబంధనను ముందుగా చూద్దాము.

## ఇశ్రాయేలు యొక్క నిబంధన (19:1-24:11)

ఇప్పుడు, ఇశ్రాయేలు యొక్క నిబంధనను గూర్చిన నివేదిక నిర్గమకాండము యొక్క వాస్తవిక శ్రోతల కొరకు ఒక ప్రాముఖ్యమైన ప్రశ్నకు జవాబునిస్తుంది: తమకు ముందు తరము వారు సీనాయి పర్వతము యొద్ద మోషే ద్వారా పొందుకొనిన నిబంధనా ధర్మశాస్త్రమునకు నిర్గమకాండము యొక్క రెండవ తరమువారు ఎందుకు లోబడియుండాలి? వారు వేరే మార్గమును ఎందుకు అనుసరించకూడదు?

ఇశ్రాయేలు యొక్క నిబంధనకు అంకితం చేయబడిన ఈ అధ్యాయములు ఈ ప్రశ్నకు నాలుగు దశలలో జవాబునిస్తాయి. మొదటిగా, నిర్గమ. 19:1 నుండి 8వ వచనము యొక్క ఆరంభభాగము వరకు, దేవునితో ఇశ్రాయేలు యొక్క నిబంధన ప్రారంభమును మనము కనుగొంటాము.

నిబంధన యొక్క ప్రారంభము (19:1-8a). ఈ వచనములు మోషే నిబంధనలోని మూడు షరతులను వెల్లడి చేస్తాయి: దేవుడు ఇశ్రాయేలీయుల పట్ల దయను చూపాడు; ఆయన వారి నుండి స్వామిభక్తిని ఆశించాడు; వారు ఆయనకు విధేయులైతే దీవించబడతారు. ఇశ్రాయేలు యొక్క ఉత్సాహభరితమైన మరియు ఏకగ్రీవమైన స్పందనతో నిర్గమ. 19:8 ముగుస్తుంది: "యెహోవా చెప్పినదంతయు చేసెదము." అవును, ఇక్కడ విషయము చాలా స్పష్టముగా ఉంది; నిర్గమకాండము యొక్క రెండవ తరము శ్రోతలు తమ ముందు తరమువారిని అనుకరించాలి. అదే ఉత్సాహముతో వారు మోషే ద్వారా దేవుని నిబంధనకు మరొకసారి సమర్పించుకోవాలి.

మోషే మీద ఇశ్రాయేలు ఉంచవలసియుండిన నమ్మకము (19:8b-20:20). మోషే అధికారము మరియు ఇశ్రాయేలు యొక్క నిబంధనలోని రెండవ దశ దేవుని నిబంధనకు మధ్యవర్తిగా ఇశ్రాయేలు మోషే మీద ఉంచవలసియుండిన నమ్మకమైయున్నది. ఇది నిర్గమకాండము 19వ అధ్యాయము, ఎనిమిదవ వచనము యొక్క రెండవ భాగముతో ఆరంభమై 20:20 వరకు కొనసాగుతుంది. నిర్గమ. 19:9లో, దేవుడు మోషేకు ఈ వాగ్దానమును చేసిన విషయము మీకు జ్ఞాపకముండే ఉంటుంది:

> యెహోవా మోషేతో ఇదిగో నేను నీతో మాటలాడునప్పుడు ప్రజలు విని నిరంతరము నీయందు నమ్మకముంచునట్లు నేను కారు మబ్బులలో నీయొద్దకు వచ్చెదనని చెప్పెను (నిర్గమ. 19:9)

"ప్రజలు [మోషే] యందు *నిరంతరము* నమ్మకముంచునట్లు" సీనాయి పర్వతము మీద ప్రత్యక్షమై మోషేతో మాట్లాడతానని దేవుడు ఇక్కడ చెప్పిన మాటను గమనించండి. దేవుడు ఈ వాగ్దానమును ఎలా నిలబెట్టుకున్నాడో తరువాత వచ్చు దృశ్యములు వివరిస్తాయి.

ఈ దశ యొక్క ముఖ్య అంశములు దేవుడిచ్చిన హెచ్చరిక, మోషే చూపిన విధేయత, మరియు దేవుడు ప్రత్యక్షమగుట అను రెండు సమాంతర క్రమములను కలిగియుంటుంది. 19:10-19లో మొదటి క్రమము కనిపిస్తుంది, అక్కడ దేవునితో కలుసుకొనుటకు ఇశ్రాయేలును సిద్ధపరచమని ఆయన మోషేను హెచ్చరించాడు. మోషే దేవుని హెచ్చరికకు విధేయుడైయ్యాడు, ఫలితంగా సీనాయి పర్వతము మీద ఒక



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

నాటకీయమైన దేవుని ప్రత్యక్షత—అనగా దేవుని సన్నిధి యొక్క మహిమకరమైన, దృశ్యమైన మరియు వినదగ బయలుపాటు — కలిగింది.

తరువాత, మనము నిర్గమ. 19:20-25లో రెండవ క్రమమును చదువుతాము. ప్రజలను సిద్ధపరచమని దేవుడు మరొకసారి మోషేను హెచ్చరించాడు, మరియు మోషే విధేయుడయ్యాడు. ఫలితంగా, 20:1-17లో, ఇశ్రాయేలు అంతా వినునట్లు సీనాయి పర్వతము మీద దేవుడు పది ఆజ్ఞలను పలికినప్పుడు కలిగిన దేవుని ప్రత్యక్షత వైపుకు మరొకసారి ఈ కథనము మళ్లుతుంది.

ఈ భాగము యొక్క ఆరంభ భాగములో దేవుడిచ్చిన వాగ్దానమును సమతుల్యము చేయుటకు, దేవుడు మోషేతో చేసిన వాగ్దానము నెరవేర్చబడింది అని నిర్గమ. 20:18-20 వివరిస్తుంది. పర్వతము మీద నుండి దేవుని స్వరమును వినిన తరువాత, ఇశ్రాయేలీయులు భయపడిపోయి తమతో సూటిగా మాట్లాడుటను ఆపివేయమని దేవుని కోరిన విధానమును ఈ వచనములు తెలియజేస్తాయి. దేవుని తరుపున తమతో మాట్లాడమని వారు మోషేతో ప్రాధేయపడ్డారు. రెండవ తరము శ్రోతల కొరకు ఈ నివేదన యొక్క అంతర్భావము చాలా స్పష్టముగా ఉన్నది. తమ ముందు తరమువారు దేవుని నిబంధన ధర్మశాస్త్రమునకు మధ్యవర్తిగా ఉండుటకు మోషేను ఆశ్రయించారు కాబట్టి, వారు కూడా ఆశ్రయించాలి.

మోషే యొక్క నిబంధన ధర్మశాస్త్రము (20:21-23:33). మోషే అధికారము మరియు ఇశ్రాయేలు యొక్క నిబంధన అను ఈ భాగములోని మూడవ దశను నిర్గమ. 20:21-23:33లో మనము కనుగొనవచ్చు. ఈ అధ్యాయములు మోషే నిబంధన ధర్మశాస్త్రములోని ముఖ్య విషయములను తెలియజేస్తాయి. ఇశ్రాయేలుకు ధర్మశాస్త్రమును ఇవ్వమని దేవుడు స్వయంగా మోషేకు ఆజ్ఞాపించాడు అని గుర్తిస్తూ ఈ దశ అంతా మోషే యొక్క అధికారమును సమర్థిస్తుంది.

ఈ దశ 20:21-26లో పరిచయం చేయబడింది. ఇక్కడ, ఆరాధన కొరకు — విగ్రహములు మరియు బలిపీఠములకు సంబంధించిన హెచ్చరికలు — తన నియమములను ఇశ్రాయేలుకు తెలియజేయమని దేవుడు హెచ్చరించాడు. ఈ వచనములు పది ఆజ్ఞలలోని మొదటి రెండు ఆజ్ఞలను వివరిస్తాయి. దీని తరువాత, 21:1-23:33లో నిబంధన గ్రంథములోని విషయములను ఇశ్రాయేలుకు తెలియజేయమని దేవుడు మోషేను హెచ్చరించాడు.

నిబంధన గ్రంథము ఇశ్రాయేలులో ఏ విధంగా పని చేస్తుందో అర్థము చేసుకొనుటకు, నిర్గమ. 21:1లో దేవుడు నిబంధన గ్రంథమును ఈ విధంగా వర్ణించాడు అని గమనించుట చాలా అవసరమైయున్నది:

> నీవు వారికి నియమింపవలసిన న్యాయవిధులేవనగా (నిర్గమ. 21:1).

ఇక్కడ “న్యాయవిధులు” అని అనువదించబడిన హెబ్రీ పదము *הַמִּשְׁפָּטִים* (*హమ్మిష్పటీం*). ఈ పదమునకు “న్యాయ తీర్పులు”, లేక “న్యాయ నియమములు” అను మాటల యొక్క అర్థములు ఉన్నాయి. నిబంధన గ్రంథమునకు ఇవ్వబడిన ఈ బిరుదు మోషే ద్వారా దేవుడిచ్చిన రెండింతల నిబంధన ధర్మశాస్త్రము పట్ల మనకు ఒక స్పష్టమైన దృక్పథమును కలిగిస్తుంది. ప్రాముఖ్యముగా, పది ఆజ్ఞలు ఇశ్రాయేలులో చట్టబద్ధమైన న్యాయవిధులుగా, లేక సాధారణ చట్టపరమైన నియమాలుగా పని చేశాయి. మరియు నిబంధన గ్రంథము ఇశ్రాయేలు యొక్క న్యాయాధిపతులు అనుసరించవలసియుండిన అనేక అంశములకు సంబంధించిన చట్టబద్ధమైన నియమములను అందించింది. వీటిలో అనేక

నియమములు *కోడ్ ఆఫ్ హమ్మురబి* మరియు పురాతన పశ్చిమ ఆసియాలోని అనేక ఇతర న్యాయ నియమాలను పోలియున్నాయి. తమ దేశములలోని న్యాయాలయములలో న్యాయాధిపతులు ఉపయోగించుట కొరకు ఈ కోడ్లు మరియు నిబంధన గ్రంథము నియమించబడినవి.

> నిబంధన గ్రంథమునకు మరియు క్రీ.పూ. మూడవ సహస్రాబ్ది నుండి రెండవ సహస్రాబ్ది మధ్య కాలములో పురాతన పశ్చిమ ఆసియాలో ఉన్న చట్టపరమైన నియమములకు మధ్య అనేక పోలికలు ఉన్నాయి. నిబంధన నేపథ్యము విషయములో మాత్రం ఇది భిన్నముగా ఉన్నది. వీటిలో అన్నిటి కంటే ఎక్కువ నియమాలను కలిగిన హమ్మురబి కోడ్ అత్యంత ప్రఖ్యాతిగాంచినది... "ఒకవేళ-అయితే" పద్ధతిలో రూపించబడిన ఈ నియమములు — "అయితే" సాధారణంగా పరిస్థితికి పౌర హక్కును ఇస్తుంది — నిర్గమ 21:1 నుండి 22:16 వరకు రూపొందించబడిన న్యాయవిధులను పోలియున్నవి, మరియు ఇవి కూడా వ్యాజ రూపము అని పిలువబడు "ఒకవేళ-అయితే" నిర్మాణమును ఉపయోగించాయని నా అభిప్రాయము. మనము వాస్తవిక వివరములను చూసినప్పుడు, పురాతన ఇశ్రాయేలు సమాజము మరియు పురాతన బబులోను సమాజమునకు మధ్య అనేక భిన్నత్వములు ఉండేవి, ఉదాహరణకు మెసొపొతమియలోని పట్టణ-రాజ్య నిర్మాణములు వంటివి భిన్నత్వములు. బబులోనియాలోని పట్టణ-రాజ్యము ఎన్నో విభజనలు కలిగిన సమాజముగా ఉండేది, దీనిలో స్వతంత్ర వ్యక్తులు ఉండేవారు, పుట్టుస్వతంత్రముగల వ్యక్తులు మరియు సామాన్యులు మరొక స్థాయిలో ఉండేవారు, మరియు తరువాత బానిసలు ఉండేవారు. దానిలో భిన్నమైన వాణిజ్యము మరియు సమాజములో భిన్నమైన వాణిజ్య పాత్రలు ఉండేవి. వాణిజ్యమునంతా నియంత్రించగల బలమైన దేవాలయ ప్రాంగణము ఉండేది. రాజ గృహము, లేక కోట సమాజము యొక్క నిర్మాణములో ముఖ్య భూమికను పోషించేది. మరియు ఇది మధ్యకాల భూస్వాముల సమాజములను పోలియున్న భూస్వామ్య వ్యవస్థను అనుసరించేది. ఇశ్రాయేలు సమాజము మరికొంత సమతావాదము కలిగినదిగా ఉండేది, కాని ఆధునిక వ్యక్తిగతవాద భావనలోగాక, వ్యవసాయ వాణిజ్యమును కలిగియుండి భూమి విషయములో గోత్ర క్రమమును అనుసరించేది. కాబట్టి, ఒకే విధమైన భేదములు ఉండేవి కాదు, మరియు హమ్మురబి కోడ్ లో కనిపించునటువంటి అదే రకమైన సామాజిక విభజన కూడా కనిపించేది కాదు.
>
> — డా. డగ్లస్ గ్రోప్ప్

నిబంధనను స్థాపించుట (24:1-11). మోషే అధికారము మరియు ఇశ్రాయేలు యొక్క నిబంధనను గూర్చిన నాల్గవ మరియు చివరి దశలో, నిర్గమ. 24:1-11 నిబంధనను స్థాపించుటను నివేదిస్తుంది. నిర్గమ. 19:1 నుండి 8వ వచనము వరకు ఉన్న నిబంధన యొక్క ప్రారంభముతో

ఆరంభమైనదానిని నాల్గవ దశ పూర్తి చేస్తుంది. విశేషముగా నిర్గమ. 24:3 మరియు 7 రెండు దేవుడు ఆజ్ఞాపించదంతయు చేస్తామను సమర్పణను ఇశ్రాయేలు ఏకముగా పునరావృతం చేసిన 19:8ను ప్రతిధ్వనిస్తాయి అని గమనించండి.

దీనిని మించి, ఇశ్రాయేలు నాయకులు సీనాయి పర్వతమునెక్కి దేవుని చూసి, ఆయనతో అద్భుతమైన సామరస్యము కలిగి తిని, త్రాగిన విషయమును ఈ దశ యొక్క ఆఖరి సన్నివేశము వర్ణిస్తుంది. దేవునితో సమాధానము మరియు సామరస్యమును చిత్రించిన ఈ సన్నివేశము యొక్క అద్భుతము నిర్గమకాండము యొక్క వాస్తవిక శ్రోతలలో ఉన్న సందేహమును తొలగించుటకు రూపొందించబడింది. వారు దేవునితో సమాధానమును మరియు సామరస్యమును ఎలా అనుభవించగలరు? తమ దినములలో మోషే ద్వారా ఇవ్వబడిన దేవుని నిబంధన న్యాయవిధుల యొక్క నిలిచియుండు అధికారమును ఒప్పుకొనుట ద్వారా మాత్రమే.

నిర్గమ. 19:1-24:11లో ఇవ్వబడిన ఇశ్రాయేలు యొక్క నిబంధనను చూచుట ద్వారా సీనాయి పర్వతము యొద్ద కనానులో ప్రవేశించుటకు మోషే మరియు ఇశ్రాయేలు చేసిన సిద్ధపాటును మనము విశదీకరించాము కాబట్టి, ఇప్పుడు నిర్గమకాండము యొక్క చివరి ప్రధానమైన అంశమును మనము చూడవలసియున్నది. మోషే అధికారము మరియు ఇశ్రాయేలు యొక్క మందిరము మీద ఉద్ఘాటన నిర్గమ. 24:12-40:38లో కనిపిస్తుంది. దేవుని మందిరమును స్థాపించుటలో మోషే పోషించిన కీలకమైన పాత్ర మీద దృష్టిపెట్టుట ద్వారా ఈ అధ్యాయములు మోషే యొక్క నిలిచియుండు అధికారముకు మద్దతునిస్తాయి.

## ఇశ్రాయేలు యొక్క మందిరము (24:12-40:38)

ఇశ్రాయేలు యొక్క మందిరము ఆరాధన చేయు ఏదో ఒక చిన్న ఛాపెల్ ను పోలియుంటుంది అని చాలామంది విద్యార్థులు ఆలోచిస్తుంటారు, కాని అది దీని కంటే ఎంతో ఉన్నతమైనదని ఈ మధ్య చేపట్టిన పురావస్తుశాస్త్ర ఆవిష్కరణలు తెలియజేస్తాయి. తమ సైన్యములను వెంటబెట్టుకొని యుద్ధము చేయుటకు బయటకు వెళ్లుట పురాతన ఐగుప్తులోని ఫరోలకు ఒక ఆనవాయితీగా ఉండేది. వారు అలా వెళ్లినప్పుడు, విశాలమైన గుడారముల నిర్మాణములలో, చలనశీల కోటలలో నివసించేవారు. ఈ రాజరిక యుద్ధ గుడారములలో లోపల మరియు బయట తెరలుగల గదులు ఉండేవి మరియు వాటి చుట్టూ ప్రాంగణము ఉండేది. ఈ గుడారముల యొద్ద, సైన్యములు తమ రాజుకు సాష్టాంగపడి రాజు యొద్ద నుండి ఆదేశములను తీసుకునేవారు. ఇంచుమించు ఇదే విధముగా, నిర్గమకాండము దేవుని మందిరమును కేవలం ఒక ఆరాధన స్థలము కంటే ఉన్నతమైనదిగా పరిచయం చేస్తుంది. అది ఆయన రాజరిక యుద్ధ గుడారమైయున్నది. ఆ విధంగా, ఇశ్రాయేలు సైన్యము ఈ మందిరము వద్దనే తమ దైవిక రాజు ఎదుట సాష్టాంగపడేవారు మరియు ఇశ్రాయేలు యొక్క దైవికమైన రాజు ఇశ్రాయేలు సైన్యమునకు ఆదేశములను ఇచ్చేవాడు.

మందిరము కొరకు హెచ్చరికలు (24:12-31:18). మోషే అధికారము మరియు ఇశ్రాయేలు యొక్క మందిరమును గూర్చిన నివేదిక మూడు ప్రధానమైన భాగములుగా విభాగించబడుతుంది. మొదటిగా, నిర్గమ. 24:12-31:18లో మందిరము కొరకు మోషేకు దేవుడిచ్చిన హెచ్చరికలు ఉన్నాయి. పది ఆజ్ఞలను రాతి



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పలకల మీద స్వీకరించమని దేవుడు మోషేకు ఇచ్చిన పిలుపుతో నిర్గమ. 24:12-18లో మందిరము కొరకు దేవుని యొక్క హెచ్చరికలు ఆరంభమైయ్యాయి. తరువాత మందిరము కొరకు దేవుడిచ్చిన విశేషమైన హెచ్చరికలు 25:1-31:17లో వ్రాయబడియున్నాయి. మందిరములో ఉండవలసిన వస్తువులు మరియు నిర్మాణ విధానములను గూర్చి వివరణాత్మకమైన వర్ణనలను ఈ హెచ్చరికలు ఇచ్చాయి. యాజకులు, శిల్పులు, మరియు నైపుణ్యముగల పనివారి కొరకు సూచనలు ఇస్తూ మందిరములో పని చేయువారిని గూర్చి మరియు ఆచారములను గూర్చి కొన్ని మార్గదర్శకాలను కూడా దేవుడు సెలవిచ్చాడు. ప్రతి వారము పాటించవలసిన విశ్రాంతి దినమును గూర్చి ఆయన సూటిగా హెచ్చరికలను ఇచ్చాడు. ఈ వివరముల యొక్క సంఖ్య మరియు వైశాల్యత దేవుని యొక్క రాజరిక యుద్ధ గుడారములో కొన్ని నియమములను పాటించవలసిన ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తాయి. తరువాత, హెచ్చరికలను గూర్చిన ఈ ముఖ్య అంశముల తరువాత, నిర్గమ. 31:18లో మోషే పది ఆజ్ఞలను కలిగియున్న రాతి పలకలను విజయవంతముగా పొందుకొనుటను మనము చూస్తాము. మందిరము కొరకు దేవుడిచ్చిన సూచనలకు ఇది ముగింపుగా ఉన్నది.

ఇప్పుడు, ఈ భాగములో అనేక సందర్భములలో, సీనాయి పర్వతము యొద్ద ఉన్న ఇశ్రాయేలీయులకు మాత్రమే తన నియమములు వర్తించవని దేవుడు స్పష్టముగా సూచించాడు. అవి నిర్గమకాండములోని రెండవ-తరము శ్రోతల కొరకు కూడా ఇవ్వబడినవి. నిర్గమ. 27:21; 28:43; 29:9 మరియు 42; 30:21; మరియు 31:16 వంటి చోట్ల, "వారి తరతరముల వరకు నిత్యమైన కట్టడి" అను మాటను అనేక విధాలుగా దేవుడు ఉపయోగించాడు. మందిరము కొరకు ఇవ్వబడిన హెచ్చరికలలో పలు అంశములను భవిష్యత్ తరములవారు ఏ విధంగా ఆచరించాలో ఇది సూచించింది. అవును, వాస్తవిక శ్రోతల కొరకు ఈ సమీకరణముల యొక్క బిందువులు చాల స్పష్టముగా ఉండినవి. దేవుడు మందిరము కొరకు ఇచ్చిన హెచ్చరికలను వారు తమ దినములలో కూడా పాటించవలసియుండెను.

> నిర్గమకాండములో వర్ణించబడిన విధముగా మందిరమును నిర్మించు విధానములో, అనగా స్తంభములు మరియు కర్రలతో దానిని నిలువబెట్టి, అది కదులునదిగా ఉండునట్లు దానిని విప్పి మోసుకొని వెళ్లుటకు వీలుగా నిర్మించబడిన విధానములో అనేక పోలికలు ఉన్నాయి. ఐగుప్తులో వేర్వేరు కాలములకు పోలికలు ఉన్నాయి, కాని అబు సింబెల్ దేవాలయము యొద్ద రామసేసు II చేసిన కాదేషు యుద్ధమునకు విశేషముగా ఎక్కువ పోలికలు ఉన్నాయి, ఇది కాదేషు యుద్ధమును జ్ఞాపకము చేసుకుంటుంది, మరియు అతడు దీనిలో జయమును పొందానని దావా చేశాడు, కాని అతడు ఏదొక విధముగా ప్రాణాలతో బయటపడ్డాడని చాలా మంది పండితులు నమ్ముతారు. అయితే అబు సింబల్ గోడ మీద అతని గుడారమును, అతని సొంత యుద్ధ గుడారమును వర్ణించు ఒక చిత్రము ఉన్నది, మరియు దానిలో మందిరమునకు ఉన్న అవే కొలతలు ఉన్నాయి, చతురస్రాకారములో లోపలి గది ఉన్నది, అది అతని సింహాసనము ఉండు గది అయ్యుండవచ్చు, మరియు లోపటి గదికి రెండింతల వైశాల్యమున్న పొడవాటి గది ఉంది, మరియు దానికి బయట మందిరము యొక్క వెలుపల ఉన్నట్లే దీర్ఘ చతురస్రాకారములో ప్రాంగణము ఉన్నది. అంతేగాక,

> సంఖ్యాకాండములో వర్ణించబడిన విధముగానే, తన గుడారము యొక్క నాలుగు దిక్కులలో నాలుగు గుంపుల సైన్యము ఉన్నట్లు ఆ చిత్రము చూపెడుతుంది. మందిరము చుట్టూ కూడా మొదటిగా లేవీయులు, అటు తరువాత నాలుగు దిశలలోను మూడు గోత్రముల ప్రజల యొక్క నాలుగు గుంపులు ఉండేవి.
>
> — డా. డగ్లస్ గ్రోప్ప్

వైఫల్యము మరియు పునరుద్ధరణ (32:1-34:35). మందిరము కొరకు దేవుడు హెచ్చరికలను ఇచ్చిన తరువాత, నిర్గమ. 32:1-34:35లో సీనాయి పర్వతము యొద్ద ఇశ్రాయేలు యొక్క వైఫల్యమును మరియు పునరుద్ధరణను మోషే జ్ఞాపకము చేసుకున్నాడు. ఈ అధ్యాయములు మూడు ప్రధానమైన దశలుగా విభాగించబడతాయి. 32:1-35లో, సీనాయి పర్వతము యొద్ద బంగారు దూడ యొక్క ప్రతిమను ఆరాధించుట ద్వారా ఇశ్రాయేలీయులు దేవునితో తమ నిబంధనను ఉల్లంఘించారు అని మనము చదువుతాము. మోషే తనను తాను ఇశ్రాయేలుతో గుర్తించుకొని, వారి కొరకు విజ్ఞాపన చేశాడు కాబట్టి, ఈ అధ్యాయములు మోషే యొక్క అధికారమును సమర్థిస్తాయి. తన జీవితమును పణంగా పెట్టి, మోషే విజ్ఞాపన చేసి ఇశ్రాయేలుపైన దేవుని దయను పొందాడు. మరియు దేవుడు దేశమును పూర్తిగా నాశనము చేయలేదు.

తరువాత, నిర్గమ. 33:1-23లో ఉన్న ఈ భాగము యొక్క రెండవ దశ, దేవుని అనుపస్థితి వలన కలిగిన భయము మీద దృష్టిపెడుతుంది. వెంటనే దేశమును నాశనము చేయనని ఒప్పుకొనిన తరువాత, దేవుడు మోషేను ముందుకు కదలమని ఆజ్ఞాపించాడు. మార్గమధ్యములో తాను ఇశ్రాయేలును నాశనము చేసే అవకాశం ఉంది కాబట్టి దేవుడు తన సన్నిధిని వారి మధ్య నుండి తీసివేస్తానని దేవుడు సెలవిచ్చాడు. అయితే మోషే మరొకసారి దేశము కొరకు నిలువబడి, ఇశ్రాయేలు కొరకు విజయవంతముగా విజ్ఞాపన చేసి, దేవుని అనుపస్థితి అను భయమును తొలగించాడు.

34:1-35లో ఉన్న ఈ భాగములోని మూడవ దశ, ఇశ్రాయేలుతో దేవుడు చేసిన నిబంధన పునరుద్ధరణను గూర్చినది. తన నిబంధనను పునరుద్ధరించుట ద్వారా తాను ఇశ్రాయేలుతో కలసి కనానుకు వెళ్తానని దేవుడు నిర్ధారించాడు. నిబంధన యొక్క పునరుద్ధరణ సమయములో మోషే చేసిన ప్రభావవంతమైన విజ్ఞాపనలను గూర్చి నివేదించుట ద్వారా ఈ అధ్యాయము ఇశ్రాయేలు నాయకునిగా మోషేను ఘనపరుస్తుంది.

మందిర నిర్మాణము పూర్తి అగుట (35:1-40:38). చివరిగా, మోషే అధికారము మరియు ఇశ్రాయేలు యొక్క మందిరమును గూర్చిన భాగము నిర్గమ. 35:1-40:58లో మందిర నిర్మాణము పూర్తి అగుటతో ముగుస్తుంది. 35:1-3లో ప్రతి వారము పాటించవలసిన విశ్రాంతి దినమును గూర్చి జ్ఞాపకము చేయుటతో ఈ అధ్యాయములు ఆరంభమవుతాయి. తరువాత 35:4-39:43లో మందిరమును నిర్మించి దానిలోని కార్యకలాపాలను ఆరంభించమని దేవుడు మోషేకు ఆజ్ఞ ఇచ్చాడు. నిర్గమ. 40:1-33 మందిరము యొక్క వాస్తవిక కట్టడమును వర్ణిస్తుంది. మందిరము యొక్క కట్టడము, అనగా దేవుని రాజరిక యుద్ధ గుడారము దేవుడు ఇంతకు ముందు ఇచ్చిన హెచ్చరికలను సంపూర్ణముగా ఎలా నెరవేర్చగలిగినదో ఈ వచనములలో ఉన్న వివరాలు తెలియజేస్తాయి. మందిరమును పూర్తి చేయుట వలన దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చిన ఆశీర్వాదముతో 40:34లో ఈ భాగము ముగుస్తుంది.

ఇశ్రాయేలు మీద దేవుని ఆశీర్వాదమును గూర్చిన చివరి దృశ్యము మరొకసారి మోషే యొక్క అధికారము మీద దృష్టిపెడుతుంది. దేవుని మందిరములోని నియమములన్నిటిని ఆచరించుట ద్వారా మోషేకు సమర్పించుకోమని ఇది వాస్తవిక శ్రోతలను ప్రోత్సహించింది, తద్వారా వారు కూడా దేవుని ఆశీర్వాదములను పొందుకుంటారు. ఈ పుస్తకము యొక్క ఆఖరి వచనములైన నిర్గమ. 40:36-38ని వినండి:

> మేఘము మందిరముమీదనుండి పైకి వెళ్లునప్పుడెల్లను ఇశ్రాయేలీయులు ప్రయాణమై పోయిరి. ఇదే వారి ప్రయాణ పద్ధతి. ఆ మేఘముపైకి వెళ్లనియెడల అది వెళ్లు దినమువరకు వారు ప్రయాణము చేయకుండిరి. ఇశ్రాయేలీయులందరి కన్నుల ఎదుట పగటివేళ యెహోవా మేఘము మందిరముమీద ఉండెను. రాత్రివేళ అగ్ని దానిమీద ఉండెను. వారి సమస్త ప్రయాణములలో ఈలాగుననే జరిగెను (నిర్గమ. 40:36-38).

కనాను వైపునకు ఇశ్రాయేలు చేసిన ప్రయాణములను మహిమకరముగా క్రోడీకరించుట ద్వారా మోషే ఈ పుస్తకమును ముగించాడు. మొదటి తరమువారు మందిరము కొరకు మోషే ఇచ్చిన హెచ్చరికలకు సమర్పణ కలిగియుండిరి కాబట్టి దేవుని సన్నిధి వారితో నిలిచియుండినది అని అతడు చూపాడు. రెండవ తరము శ్రోతలు కూడా తమ సొంత కన్నులతో దేవుని యొక్క అద్భుతమైన సన్నిధిని చూసే అవకాశము ఉండినది. మరియు వారు వాగ్దాన దేశమును స్వాధీనపరచుకొనుటకు ముందుకు కొనసాగుచుండగా దేవుని సన్నిధి వారితో ఉండాలని వారు ఆశించియుంటే, వారు మోషే ఇచ్చిన మందిరపు హెచ్చరికలకు — వారి దైవిక రాజు యొక్క రాజరిక యుద్ధ గుడారము కొరకు ఇవ్వబడిన హెచ్చరికలకు — సమర్పణ కలిగియుండవలసియుండెను.

ఇప్పటి వరకు మనము కొన్ని ఆరంభ పరిగణలను, నిర్గమకాండము యొక్క నిర్మాణము మరియు విషయములను చూశాము కాబట్టి, ఇప్పుడు మన మూడవ ముఖ్య అంశమును చూడవలసియున్నాము: ఈ పుస్తకములోని ముఖ్య అంశములు. నిర్గమకాండములో వాస్తవిక శ్రోతల యొక్క జీవితముల మీద ప్రభావమును చూపిన కొన్ని అత్యంత ప్రాముఖ్యమైన విషయములు ఏవి? మరియు నేడు క్రీస్తు అనుచరుల కొరకు ఈ ముఖ్య అంశములు ఏ విధంగా అనువర్తించబడాలి?

## ముఖ్య అంశములు

ఈ పాఠం అంతటిలో, ఇశ్రాయేలు మీద మోషే యొక్క నిలిచియుండు అధికారమును ఎత్తి చూపుటకు నిర్గమకాండము ఎలా వ్రాయబడిందో మనము చూశాము. ఈ అంశము ఎంత ప్రాముఖ్యమైయున్నప్పటికీ, ఈ గ్రంథములో ఈ *ఒక్క* అంశము మాత్రమే లేదను విషయమును మనమెప్పుడు జ్ఞాపకముంచుకోవాలి. ఈ లేఖనములు మోషే యొక్క అధికారమును సమర్థించుచున్నప్పటికీ, ఈ ప్రాముఖ్యమైన, ఐక్యపరచు అంశమునకు అనుబంధములో ఉన్న అనేక ఇతర విషయముల మీదికి దృష్టిని మళ్లించుట ద్వారా వారు దీనిని చేస్తారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మోషే అధికారము మాత్రమేగాక నిర్గమకాండము అనేక ఇతర అంశములను ఏ విధంగా అల్లుతుంది అంటే, దానిని మనము అనేక భిన్నమైన విధానములలో క్రోడీకరించవచ్చు. అయితే దేవుని రాజ్యమును ఈ పుస్తకము ఏ విధంగా ఉద్ఘాటిస్తుందో విశదపరచుట ఈ పుస్తకములోని ముఖ్య అంశములను క్రోడీకరించుటకు అత్యంత ఉపయోగకరమైన ప్రణాళికలలో ఒకటిగా ఉన్నది. ఇప్పుడు, ఈ అంశము బైబిలు అంతంటిలో ఉన్నది, మరియు క్రొత్త నిబంధనలో ఇది సంపూర్ణతను పొందుతుంది, కాబట్టి ఈ పుస్తకములో ఈ అంశమును గూర్చి చర్చించుట మనకు చాలా ప్రాముఖ్యమైయున్నది. ఇప్పుడు, కొన్నిసార్లు ఆధునిక క్రైస్తవులు నిర్గమకాండములోని ఈ కోణమును చూడలేరు, కాని సీనాయి పర్వతము యొద్ద దేవుడు ఇశ్రాయేలు దేశమును ఒక నమ్మకమైన దేశముగా రూపించిన విషయమును గూర్చి, తరువాత ఆయన వారిని వాగ్దాన భూమిలో రాజ్యముగా ఉండునట్లు, తరువాత లోకమంతటికి వ్యాపించునట్లు సిద్ధపరచిన విషయమును గూర్చి నిర్గమకాండము మాట్లాడుతుందని మనకు తెలుసు. కాబట్టి, ఈ పుస్తకములో దేవుని రాజ్యము మీద ఈ ఉద్ఘాటనను మనము చూస్తాము, కాని నిర్గమకాండము దేవుని చిత్రీకరించు విధానమును గమనించుట దీనిని చూచుటకు ఒక ఉత్తమమైన మార్గముగా ఉన్నది. నిర్గమకాండములో దేవుడు ప్రధానమైన పాత్రగా ఉన్నాడు, మరియు ఇది దేవుని గూర్చి అనేక విషయములను తెలియజేస్తుంది, కాని ప్రాధమికముగా దేవుడు ఇశ్రాయేలునకు రాజు అని ఇది ఉద్ఘాటిస్తుంది.

— డా. రిచర్డ్ ఎల్. ప్రాట్ జు.

నిర్గమకాండము లేఖనమంతటిలో దేవుని రాజు అని స్పష్టముగా సంబోధించిన మొదటి పుస్తకమైయున్నది. నిర్గమ. 15:1-18లో, ఇశ్రాయేలీయులు ఆరిన నేల మీద ఎర్ర సముద్రమును దాటిన తరువాత, మోషే మరియు ఇశ్రాయేలీయులు యెహోవా కొరకు ఒక పాట పాడారు. ఈ పాటలోని మాటలు నిర్గమకాండములోని మొదటి తరమువారు మరియు రెండవ తరమువారి యొక్క అనుభవములను కలిపి తెలియజేస్తుంది. ఇది దేవుడు ఇంతకుముందు ఐగుప్తు నుండి ఇశ్రాయేలును విమోచించిన విధానము మీద, మరియు కనాను జయించి స్వాధీనపరచుకొనుటలో ఇశ్రాయేలు భవిష్యత్తులో పొందబోవుచున్న సఫలత మీద దృష్టిపెడుతుంది. ఆసక్తికరముగా, సముద్రము యొద్ద మోషే పలికిన చివరి మాటలు ఐగుప్తు నుండి ఇంతకు ముందు పొందిన విమోచనను మరియు భవిష్యత్తులో కనానును జయించి, స్వాధీనపరచుకొనుటను కలిపి దేవుని రాజత్వము యొక్క ఆధీనములో ఉంచుతాయి. నిర్గమ. 15:18లోని ఈ మాటలతో మోషే దేవుని స్తుతించిన విధానమును వినండి:

యెహోవా నిరంతరమును ఏలువాడు (నిర్గమ. 15:18).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ వచనము సూచించుచున్నట్లు, నిర్గమకాండములోని రెండు తరముల కొరకు దేవుడు చేసిన అద్భుత కార్యములు ఇశ్రాయేలు యొక్క దైవికమైన రాజుగా, "నిరంతరము ఏలువానిగా" ఆయన యొక్క మహిమను కనుపరచాయి.

దీని వెలుగులో, మోషే దినములలో నిర్గమకాండము దేవుని రాజత్వమును ఉద్ఘాటించిన నాలుగు విధానములను పరిగణించుట ద్వారా నిర్గమకాండములోని అంశములను అమర్చుట సహాయకరముగా ఉంటుంది. మొదటిగా, నిర్గమ. 1:1-4:31లో ఇశ్రాయేలుతో చేయబడిన రాజరిక నిబంధనను నెరవేర్చువానిగా దేవుని చూద్దాము. రెండవదిగా, నిర్గమ. 5:1-18:27లో ఇశ్రాయేలు యొక్క విజయుడైన రాజరిక యుద్ధశూరునిగా దేవుని మీద నిర్గమకాండము పెట్టిన విశేషమైన ధ్యాసను మనము చూద్దాము. తరువాత, నిర్గమ. 19:1-24:11లో రాజరిక నిబంధన ధర్మశాస్త్రమును ఇచ్చువాడైన దేవుడు అను అంశమును పరిశీలిద్దాము. చివరిగా, నిర్గమ. 24:12-40:38లో ఇశ్రాయేలు యొక్క ప్రస్తుత యుద్ధశూరుడైన దేవుడు అను అంశమును పరిగణిద్దాము. రాజరిక నిబంధనను నెరవేర్చువాడైన దేవుడు అను అంశముతో ఆరంభించి, ఈ అంశములన్నిటిని ఒకొక్కటిగా చూద్దాము.

## నిబంధనను నెరవేర్చువాడు (1:1-4:31)

ఇశ్రాయేలు యొక్క రాజరిక నిబంధనను నెరవేర్చువానిగా దేవుడు అను అంశము నిర్గమకాండము గ్రంథమంతటిలో కనిపిస్తుంది, కాని నిర్గమ. 1:1-4:31లో ఇది ప్రాధమికముగా ఉద్ఘాటించబడింది. ఈ అధ్యాయములు మోషే జననమునకు ముందు కాలము నుండి ఇశ్రాయేలు మీద నాయకునిగా మోషే ఎదుగు వరకు జరిగిన సన్నివేశములను తెలియజేస్తుంది. ఉదాహరణకు, నిర్గమ. 2:24ను వినండి, అక్కడ మనము ఇలా చదువుతాము:

> కాగా దేవుడు [ఇశ్రాయేలీయుల] మూలుగును విని, అబ్రాహాము ఇస్సాకు యాకోబులతో తాను చేసిన నిబంధనను జ్ఞాపకము చేసికొనెను (నిర్గమ. 2:24).

ఈ వచనము చాలా ప్రాముఖ్యమైనది, ఎందుకంటే దేవునికి భయపడిన మంత్రసానులను దేవుడు దీవించాడు అని సెలవిచ్చిన చోట ఉన్న ఒక క్లుప్త ప్రస్తావన మినహా, నిర్గమకాండములో దేవుని గూర్చి ఇక్కడ మొదటిసారి ప్రస్తావించబడింది. కాబట్టి, ఆరంభము నుండే, నిర్గమకాండము దేవుని రాజరిక నిబంధనను నెరవేర్చువానిగా, "ఆయన చేసిన నిబంధనను జ్ఞాపకము చేసుకున్నవానిగా" ప్రస్తుతిస్తుంది.

లేఖనములు దేవుని గూర్చి మరియు ఆయన నిబంధనలను గూర్చి ప్రస్తావించిన ప్రతిసారి, అవి ఇశ్రాయేలు యొక్క దైవికమైన రాజుగా ఆయన మీద పరిపూర్ణముగా దృష్టిపడతాయి. బైబిలు కాలములో, పురాతన పశ్చిమ ఆసియాలో ఉన్న రాజులు ఇతర దేశములతో ఒప్పందములను చేసుకున్న విధముగానే దేవుడు తన ప్రజలతో నిబంధనలను చేశాడు. నేడు, ఈ అంతర్జాతీయ ఒప్పందములను మనము "ప్రభువు-సామంత ఒప్పందములు" అని పిలుస్తాము. ఈ ఒప్పందములో, గొప్ప రాజులు, లేక సుజెరైన్లు, చిన్న రాజులతో, లేక సామంతులతో మరియు వారి దేశములతో కొన్ని గంభీరమైన ఒప్పందములను చేసుకునేవారు. ఇశ్రాయేలు యొక్క నమ్మకమైన *నిబంధనను నెరవేర్చువానిగా* దేవుడు కూడా వారి యొక్క దైవికమైన రాజు అని ఇశ్రాయేలీయులు అర్థము చేసుకున్నారు. మరియు మోషే దినములలో కార్యములు చేయుట ద్వారా ఇశ్రాయేలు యొక్క పితరులతో చేసిన నిబంధనలను



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఆయన నెరవేర్చాడు. కాబట్టి, మోషేతో దేవుడు చేసిన నిబంధన ఇంతకు ముందు ఇశ్రాయేలు పితరులతో చేయబడిన నిబంధనల కంటే భిన్నమైనది కాదు. వాస్తవానికి, అది వాటి యొక్క నెరవేర్పుగా ఉన్నది. దేవుడు మోషేకు తన పేరును బయలుపరచినప్పుడు నిర్గమ. 3:14-15లోని ఈ ఉద్ఘాటనను వినండి.

> నేను ఉన్నవాడను అనువాడను. ఇశ్రాయేలీయులతో నీవు ఇలా చెప్పవలెను: ... ఉండుననువాడు మీయొద్దకు నన్ను పంపె[ను]... మీ పితరుల దేవుడైన యెహోవా, అనగా అబ్రాహాము దేవుడు ఇస్సాకు దేవుడు యాకోబు దేవుడునైన యెహోవా మీ యొద్దకు నన్ను పంపె[ను]... (నిర్గమ. 3:14-15).

ఐగుప్తులో ఉన్న ఇశ్రాయేలీయులకు తనను మూడు పేర్లతో పరిచయం చేయమని దేవుడు ఇక్కడ మోషేకు చెప్పిన విషయమును గమనించండి: "నేను ఉన్నవాడను అనువాడను," "ఉండుననువాడు," మరియు "యెహోవా."

రాజరిక నిబంధనను నెరవేర్చువానిగా ఈ పేర్లు దేవునితో ఏ విధముగా అనుబంధం కలిగియున్నాయో అర్థము చేసుకొనుటకు, ఈ మూడు పేర్లు *הָיָה* (హాయహ్) అను ఒకే హెబ్రీ క్రియా పదమునకు చెందినవని మనము అర్థము చేసుకోవాలి. ఈ పదము చాలా సార్లు "ఉండుట" అను అర్థమునిచ్చు ఒక క్రియా రూపము ద్వారా అనువదించబడుతుంది. "నేను ఉన్నవాడను అనువాడను" — లేక హెబ్రీ భాష అనువదించునట్లు "నేను ఉండబోవువాడను అనువాడను" — మరియు క్లుప్త పదమైన, "ఉన్నవాడను," లేక "ఉంటాను"లో క్రియ యొక్క మొదటి-పురుష రూపములు ఉన్నాయి. అయితే "యెహోవా" అని అనువదించబడిన పేరుకు మరికొంత వివరణ ఇవ్వవలసియున్నది.

"యెహోవా" అను పదము, దైవికమైన టెట్రాగమేషన్ ను, అనగా "*YHWH*" అని తరచుగా అనువదించబడు దేవుని యొక్క నాలుగు-అక్షరముల హెబ్రీ నామమును అనువదిస్తుంది. ఈ పదమును "యాహ్వే" అని ఉచ్చరించాలని ఈ మధ్య కాల పురావస్తుశాస్త్ర ఆవిష్కరణములు సూచించాయి. యాహ్వే అను పదమును తరచుగా "యెహోవా" అని అనువదిస్తారు. అయితే ఇది "*హాయహ్*" అను క్రియా పదము యొక్క తృతీయ-పురుష రూపమును ఉపయోగిస్తుంది మరియు దీనిని "ఆయన ఉన్నాడు" లేక "ఆయన ఉంటాడు" అని అనువదించవచ్చు. వాస్తవానికి, హెబ్రీ భాషలోని కొన్ని సంకేతములను ఉపయోగిస్తు, దీనిని "ఆయన ఉండగోరుచున్నాడు" లేక "ఆయన ఉండాలని ఆశించుచున్నాడు" అని కూడా అనువదించవచ్చు. ఈ క్రమమును అనుసరించి, "నేను ఉన్నవాడను అనువాడను" అను మాటను "నాకు నచ్చిన విధముగా నేను ఉండగోరుచున్నాను" అని అనువదించవచ్చు. మరియు "ఉండుననువాడు"ను "నేను *ఉండగోరుచున్నాను*" అని అనువదించవచ్చు.

ఈ అవగాహన సరియైనదే అని అనుకుంటే, ఈ వచనములలో యాహ్వే అను పేరు, మరియు దీనికి సంబంధించిన పేర్లు, దేవుడు తన నిబంధన వాగ్దానములను *స్వయంగా నెరవేర్చుచున్నాడు* అని సూటిగా తెలియజేయుచున్నాయి. మరొక మాటలో, ఆయన ఇశ్రాయేలు పితరులతో చేసిన నిబంధన వాగ్దానములను సంపూర్ణము చేయుట ద్వారా ఆయన వాటిని నెరవేర్చుచున్నాడు.

దేవుడు తన నిబంధన వాగ్దానములను నమ్మకముగా నెరవేర్చుచున్నాడు అని మోషే ఎందుకు ఉద్ఘాటించాడో చూచుట అంత కష్టమైన పని ఏమి కాదు. ఆదికాండము 15:14లో, అన్య దేశములో కష్టముల నుండి ఇశ్రాయేలును విమోచిస్తానని దేవుడు వాగ్దానము చేశాడు. దేవుడు ఈ వాగ్దానమును



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

తమ దినములలో నెరవేర్చుచున్నాడని మోషే యొక్క శ్రోతలు తెలుసుకొనవలసియుండెను. భూత, వర్తమాన, భవిష్యత్ కాలములలో వారు పొందు ప్రతి ఆశీర్వాదము, వారి దైవిక రాజు తమ పితరులతో చేసిన నిబంధనను నెరవేర్చుటకు ఫలితముగా ఉన్నదని వారు చూడవలసియుండెను.

అనేక విధాలుగా, క్రీస్తు అనుచరుల విషయములో కూడా ఇదే వాస్తవమైయున్నది. ఇశ్రాయేలు పితరులతో చేసిన నిబంధనలన్నిటిని దేవుడు మన వర్తమాన, భూత, భవిష్యత్ కాలములలో నెరవేర్చుచున్నాడు. అబ్రాహాముతో దేవుడు చేసిన నిబంధన యొక్క అంతిమ నెరవేర్పు క్రీస్తు రాజ్యము యొక్క ఆవిష్కృతములో, అనగా ఆయన మొదటి రాకడలో జరిగింది అని లూకా 1:68-73 వంటి లేఖన భాగములు మనకు బోధిస్తాయి. దీనితో పాటు, క్రీస్తు రాజ్యము యొక్క కొనసాగింపులో దేవుని మరియు ఆయన అబ్రాహాముకు ఇచ్చిన వాగ్దానములను నమ్ముట కొనసాగించాలి అని గలతీ. 3:15-18 వంటి వాక్యభాగములు బోధిస్తాయి. అంతేగాక, క్రీస్తు రాజ్యము యొక్క నెరవేర్పులో, ఇశ్రాయేలు పితరులకు దేవుడిచ్చిన వాగ్దానముల యొక్క నెరవేర్పుగా క్రీస్తులో మనము మహిమకరమైన నిత్య ప్రతిఫలమును పొందుతామని రోమా. 4:13 వంటి వచనములు బోధిస్తాయి.

మనము క్రీస్తులో ఉన్నాము. క్రీస్తు అబ్రాహాము నిబంధనకు వారసునిగా ఉన్నాడు. మరియు అబ్రాహాముతో తాను చేసిన నిబంధనను నెరవేర్చుటలో దేవుడు విఫలముకాడు. ఇశ్రాయేలు యొక్క నిబంధనను నెరవేర్చు రాజుగా దేవుని బయలుపరచు నిర్గమకాండములోని ప్రతి వాక్యభాగములో నుండి ఇవి మరియు దీనిని పోలిన అనువర్తనములు బయలువస్తాయి.

> దేవుడు తన నిబంధన పట్ల ఎల్లప్పుడు నమ్మకముగా ఉన్నాడని నిర్గమకాండము కనుపరుస్తుంది, ఎందుకంటే ఇశ్రాయేలు సంతానము మోషేకు విరోధముగా తిరుగుబాటు చేసినప్పుడు మరియు మునుపటి కాలములో దేవుడు వారి జీవితములలో చేసిన కార్యములను గౌరవించనప్పటికీ కూడా, వారిని విమోచించుటకు దేవుడు తన వాగ్దానములను నెరవేర్చాడు. వారి తిరుగుబాటు కారణంగా దేవుడు వారిని విడచిపెట్టలేదుగాని, వారిని విమోచించాలని ఆయన కలిగియుండిన లక్ష్యమును ఆయన సాధించుటకు ముందుకు సాగాడు. మరియు మనలను ఆయనకు దగ్గరగా లాగుకొనుటకు ఆయన ఈ లక్ష్యమును మనందరి కొరకు ఉంచాడు. దేవుని నుండి మనము ఎంత దూరమైనప్పటికీ, దేవుడు మనలను ఆయనకు దగ్గరగా లాగుకొనుటకు ప్రయత్నిస్తూనే ఉంటాడు. మనము ఎంత విరిగినవారముగా ఉన్నప్పటికీ, మనలను కట్టుటకు మరియు మనలను గృహమునకు తోడ్కొని వెళ్లుటకు ఆయన మనకు దగ్గరగా వస్తాడు. కాబట్టి, నిర్గమకాండము దేవుడు మనలను పిలచిన జీవితము యొక్క ప్రతిబింబముగా ఉన్నది. మరియు ఆయన మనలను విమోచించుటకు సిద్ధముగా ఉన్నాడు. వాస్తవానికి, నిర్గమకాండము విమోచనను గూర్చిన గ్రంథమైయున్నది. ప్రజలు పడిపోయారు మరియు వారికి విమోచన అవసరమైయుండెను, మరియు మనము కూడా ప్రతి రోజు ఇలానే పడిపోతుంటాము. మరియు దేవుడు తన పనిని చేస్తాడు. మనము ఆయన కృప నుండి దూరముగా వెళ్లుటకు ప్రయత్నించినప్పుడు కూడా మనలను దగ్గరగా లాగుకొనుటలో ఆయన ఉత్తముడైయున్నాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

రెవ. డా. సిప్రియన్ కె. గుచియేండ

ఇశ్రాయేలు యొక్క రాజరిక నిబంధనను నెరవేర్చువానిగా దేవుడు అను ముఖ్యమైన అంశముతో పాటుగా, నిర్గమకాండము 5:1-18:27లో ఇశ్రాయేలు యొక్క విజయుడైన రాజరిక యుద్ధశూరునిగా దేవునిపై ఉంచబడిన ఉద్ఘాటనను చూద్దాము.

## విజయుడైన యుద్ధశూరుడు (5:1-18:27)

యుద్ధములో జయమును దైవిక మరియు మానవ రాజులకు ఆపాదించుట ఎంత సామాన్యమైన విషయమో మోషే దినములలోని ప్రతి పెద్ద రాజ్యములో జరిగిన పురావస్తుశాస్త్ర ఆవిష్కరణలు తెలియజేస్తాయి. కాబట్టి, ఇశ్రాయేలు యొక్క విజయుడైన యుద్ధశూరునిగా దేవునికి కొంత భూమికను ఇచ్చినా, ఆయన ఇశ్రాయేలు యొక్క విజయుడైన రాజుగా ఉన్నాడనుటకు అది సూచనగా ఉన్నది.

మొదటిగా మోషే ఐగుప్తులో ఉన్నప్పుడు ఇశ్రాయేలు యొక్క విజయుడైన రాజరిక యుద్ధశూరునిగా దేవుని మనము చూద్దాము. తరువాత మోషే మరియు ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి సీనాయికి ప్రయాణము చేసినప్పుడు ఈ అంశమును మనము పరీక్షిద్దాము. ఐగుప్తులో మోషేతో ఆరంభిద్దాము.

### ఐగుప్తులో

ఈ అంశము నిర్గమకాండము అంతటిలో కనిపిస్తుంది, కాని 5:1-13:6లో ఇశ్రాయేలు యొక్క విమోచన సందర్భములో దీనిని మనము విశేషముగా చూస్తాము. ఐగుప్తుకు విరోధముగా దేవుడు ఇచ్చిన ఆశ్చర్యకరమైన తీర్పులు మోషే అధికారమును సమర్థించాయి; ఇశ్రాయేలు యొక్క రాజరిక యుద్ధశూరునిగా అవి దేవుని విజయమును కూడా కనుపరచాయి.

నిర్గమ. 12:12లో, తాను ఇచ్చిన అతి గొప్ప తీర్పు, పస్కా తీర్పును దేవుడు ఈ విధంగా క్రోడీకరించాడు:

> ఆ రాత్రి నేను ఐగుప్తుదేశమందు సంచరించి, ఐగుప్తుదేశమందలి మనుష్యులలోనేగాని జంతువులలోనేగాని తొలి సంతతియంతయు హతముచేసి, ఐగుప్తు దేవతలకందరికిని తీర్పు తీర్చెదను; నేను యెహోవాను (నిర్గమ. 12:12).

ఈ వచనములో దేవుడు "నేను యెహోవాను" లేక నేను [యాహ్వేను]" అని ప్రకటించాడు. ఇక్కడ మరొకసారి, తన నిబంధనను నెరవేర్చుట ద్వారా దేవుడు తనను తాను నిబంధనను జ్ఞాపకము చేసుకొనువానిగా గుర్తించుకున్నాడు. ఇశ్రాయేలు యొక్క విజయుడైన రాజరిక యుద్ధశూరునిగా, ఆయన "మనుష్యులలోనేగాని జంతువులలోనేగాని తొలి సంతతియంతయు హతముచేయ" బోవుచుండెను. మరొక మాటలో, ఐగుప్తీయులు మరియు వారి సమాజము తమను తాము ఆయనకు విరోధులుగా చేసుకున్నారు కాబట్టి ఆయన ఐగుప్తీయులను నాశనము చేయగోరాడు. మరియు ఈ మానవ ఉద్ఘాటనతో పాటుగా, దేవుడు "ఐగుప్తు దేవతలకందరికిని తీర్పు తీర్చెదను" అని సెలవిచ్చాడు. ఐగుప్తీయులు ఆరాధించిన అబద్ధ దేవతలను, దుష్ట శక్తులను ఆయన జయిస్తాడు.

ఫరో మరియు ఐగుప్తీయులకు విరోధముగా యెహోవా ఇచ్చిన ఆశ్చర్యకరమైన తీర్పులలో కూడా మనము ఈ ద్వంద్వత్వమును చూస్తాము. ఈ తీర్పులో ప్రతి ఒక్కటి ఒకటి లేక ఎక్కువ ఐగుప్తు అబద్ధ దేవతల మీద జయమును కలిగించింది. ఉదాహరణకు, అహరోను కర్ర సర్పముగా మారి ఫరో శకునగాండ్రు చేసిన సర్పములను మ్రింగివేసినప్పుడు, ఇది కేవలం ఫరో మీద పొందిన జయము మాత్రమే కాదు. ఇది ఫరో కిరీటము మీద అలంకారముగా ఉన్న నాగుపాము రూపములోని దైవిక శక్తి మీద జయముగా ఉన్నది. దేవుడు నైలు నదిని రక్తముగా మార్చినప్పుడు, నైలునదితో అనుబంధము కలిగియున్న ముసలి రూపము దాల్చిన హపి, సెపెక్, చేప ఆకారములో ఉన్న కునుమ్, మరియు హత్మెహత్ వంటి ఐగుప్తీయుల దేవుళ్లు మరియు దేవతలపై తన శక్తిని కనుపరచాడు. కప్పల తెగులు కప్ప తలతో మానవ ఆకారము కలిగియున్న ఐగుప్తీయుల దేవతయైన హెఖేత్ మీద దేవుని శక్తిని కనుపరచింది. పేలు తెగులుతో ఏ ఐగుప్తీయుల దేవతకు నిశ్చయమైన సంబంధములేదు. అయితే భూమి దేవతయైన గెబ్ వంటి అనేక సూచనలను పండితులు ఇచ్చారు. ఈ తెగులు కూడా ఐగుప్తీయుల యాజకులు మరియు శకునగాండ్రను అవమానపరచుటకు ఉపయోగించబడియుంటుంది. ఈగల తెగులు ఎగురుచున్న బొద్దింక ఆకారమును కలిగియున్న ఖెప్రే అను దేవతకు విరోధముగా ఇవ్వబడియుండవచ్చు. జంతువుల యొక్క మరణము ఎద్దుల రూపములో చిత్రీకరించబడిన ఎపిస్, బుచిస్, నెవిస్, తః మరియు రే, మరియు దేవతల రాణియైన ఐసిస్ మరియు అందము మరియు ప్రేమ దేవతయైన హాతోర్ వంటి అనేక దేవతలపై దేవుని అధికారమును కనుపరచింది. ఈ ఇద్దరు దేవతలు ఆవుల రూపములో చిత్రించబడ్డారు. దద్దురుల తెగులు రోగము మరియు స్వస్థతతో అనుబంధము కలిగియున్న సెఖ్మెట్ మరియు ఇమ్హోటెప్ వంటి దేవతలపై దేవుని శక్తిని కనుపరచింది. వడగండ్ల తీర్పు ఆకాశ దేవతయైన నట్ మరియు ఆకాశమును పట్టుకొనియున్న షు మీద దేవుని శక్తిని కనుపరచింది. మిడతల తెగులు తెగుళ్ల నుండి కాపాడే దేవతయైన సెనెహెమ్ కు విరోధముగా ఇవ్వబడింది. చీకటి తీర్పు గొప్ప సూర్య దేవుడుయైన రే, లేక అమోన్-రే మీద యెహోవా యొక్క శక్తిని కనుపరచింది. తరువాత జ్యేష్ఠుల మరణమునకు సంబంధించిన అంతిమ తెగులు, పునరుత్పత్తితో సంబంధము కలిగిన మిన్ మరియు ఐసిస్ దేవతలకు విరోధముగా ఇవ్వబడినది. ఐగుప్తులో దేవుడిచ్చిన ఆశ్చర్యకరమైన తీర్పులు కేవలం ఆయన భౌతిక శత్రువుల మీద మాత్రమే ఆయన విజయమును కనుపరచలేదుగాని, ఆత్మీయ విరోధులు, అనగా సాతాను శక్తులపైన కూడా కనుపరచబడింది అని ఈ అనుబంధములు సూచిస్తాయి.

మోషే ఐగుప్తులో ఉన్నప్పుడు ఇశ్రాయేలు యొక్క విజయుడైన రాజరిక యుద్ధశూరునిగా దేవుడు అను అంశమును ఇప్పటి వరకు మనము చూశాము. అయితే మానవ మరియు ఆత్మీయ విరోధుల మీద దేవుని విజయము నిర్గమ. 13:17-18:27లో మోషే మరియు ఇశ్రాయేలీయులు సీనాయి పర్వతము యొద్దకు ప్రయాణించుచున్నప్పుడు కూడా ప్రత్యక్షమవుతాయి.

## ప్రయాణములో (13:17-18:27)

అవును, సీనాయి పర్వతమునకు ప్రయాణించిన మార్గములోని కష్టముల మధ్యలో దేవుడు ఇశ్రాయేలు సైన్యమును నడిపించాడు అను వాస్తవము ఆయనను ఇశ్రాయేలు యొక్క రాజరిక యుద్ధశూరునిగా బయలుపరుస్తుంది. యెర్ర సముద్రము యొద్ద మోషే పాడిన పాటను మరొకసారి



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

చూచుట ద్వార నిర్గమనములోని ఈ భాగమును ఉత్తమమైన రీతిలో వివరించవచ్చు. నిర్గమ. 15:3-4లో మోషే ఇలా పాడుచున్నాడు:

> యెహోవా యుద్ధశూరుడు యెహోవా అని ఆయనకు పేరు. ఆయన ఫరో రథములను అతని సేనను సముద్రములో పడద్రోసెను (నిర్గమ. 15:3-4).

ఇక్కడ మోషే యెహోవాను విశేషముగా "యుద్ధశూరుడు" అని గుర్తించి, "యెహోవా అని ఆయనకు పేరు" అని పునరావృతం చేశాడు. దేవుని పేరు మరియు యుద్ధశూరునిగా దేవునికి మధ్య ఉన్న ఈ దగ్గర సంబంధము "సైన్యములకధిపతియగు యెహోవా" లేక "సైన్యములను కలిగిన యాహ్వే" అను సుపరిచితమైన పాత నిబంధన వ్యక్తీకరణములకు నేపథ్యముగా ఉన్నది. ఆయన పేరు సూచించుచున్నట్లు, రాజరిక యుద్ధశూరుడైన దేవుడు సైన్యములను సిద్ధపరచి, తన విరోధులను జయిస్తాడు. ఈ సందర్భములో, "ఆయన ఫరో రథములను అతని సేనను సముద్రములో పడద్రోసెను." తరువాత, నిర్గమ. 15:11లో, మోషే ఇలా చెబుతు దేవుని విజయములోని ఆత్మీయ కోణమును కూడా గుర్తించాడు:

> యెహోవా, వేల్పులలో నీవంటివాడెవడు పరిశుద్ధతనుబట్టి నీవు మహానీయుడవు స్తుతికీర్తనలనుబట్టి పూజ్యుడవు అద్భుతములు చేయువాడవు నీవంటివాడెవడు? (నిర్గమ. 15:11).

దేవుని విజయము కేవలము ఐగుప్తు మానవ సైన్యము మీద మాత్రమే ఆయన శక్తిని కనుపరచలేదుగాని, ఐగుప్తు అబద్ధ దేవతలందరి మీద ఆయన శక్తిని కనుపరచింది.

> దేవుడు విజయుడైన యుద్ధశూరుడు అంటే అర్థము ఏమిటి? పురాతన ప్రపంచములో యెహోవా సృష్టియావత్తుకు దేవుడు మరియు నిజమైన రాజైయున్నాడు అని దీని అర్థము, మరియు నిర్గమ 15లో దీనినే మనము చూస్తాము. 15:11లోని ఈ స్తుతిలో అది గొప్ప ప్రశ్నను అడుగుతుంది: యెహోవా, వేల్పులలో నీవంటివాడెవడు? ఎవరు లేరు, అని దీనికి జవాబు. ఎవరు లేరు, విశేషముగా, దేవుని పోలిన ఇతర దేవుడు లేక దేవత లేదు. కాబట్టి, విజయుడైన యుద్ధశూరుడు అని దేవుని గూర్చి మనము మాట్లాడునప్పుడు, దేవుడు అను బిరుదును పొందుకొనుటకు కొన్ని వందల మంది దేవుళ్లు పోటీపడుతున్న సందర్భములో ఇది ఒక బలమైన వ్యాఖ్యగా ఉన్నది. సామాన్యముగా, ఇక్కడ బైబిలు ఒక తెలివైన ప్రశ్నను అడుగుతుంది. "యెహోవా, నీవంటివాడెవడు?" అనునది ప్రశ్న. ఎవరు లేరు అనునది జవాబు, మరియు ఇక్కడ ముఖ్య బిందువు: ఇతర దేవుళ్లు ఉన్నారని నీవనుకోవచ్చు, కాని చివరికి, కేవలం ఒకరు మాత్రమే దేవుడు అను బిరుదుకు యోగ్యుడు, ఆయనే యెహోవా. తరువాత నిర్గమ 15 "యెహోవా నిరంతరమును ఏలువాడు" అను మాటలతో ముగుస్తుంది. మరియు అట్టి యుద్ధశూరుడు మన కొరకు యుద్ధము చేయాలని మనము కోరతాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

— డా. బ్రియన్ డి. రసూల్

నిర్గమకాండము రెండవ-తరము శ్రోతలకు నిశ్చయతను ఇచ్చుటకు ఫరో మీద మరియు అతని అబద్ధ దేవతల మీద యెహోవా యొక్క విజయమును ఉద్ఘాటించింది. దేవుడు *వారి* భౌతిక మరియు ఆత్మీయ విరోధులను జయించగలిగాడు. మునుపు తమ ముందు తరమువారి కొరకు దేవుడు ఎలా పోరాడాడో వారు నేర్చుకున్నారు. ఈ విధంగా, వారు కనానును స్వాధీనపరచుకొనుటకు వెళ్లుచుండగా భవిష్యత్తులో ఆయన వారికి ఇవ్వబోవు జయమును గూర్చి కూడా వారు నేర్చుకున్నారు.

ఇంచుమించు ఇదే విధంగా, నిర్గమకాండములో దేవుడు సాధించిన గొప్ప జయములను గూర్చి క్రైస్తవులు నేర్చుకున్నప్పుడు, క్రీస్తు విజయమును గూర్చి క్రొత్త నిబంధన బోధించు విషయములను మనము ప్రతిబింబించవచ్చు. మత్తయి 12:28 మరియు 29, యోహాను 12:31, మరియు కొలస్సీ. 2:15 వంటి వాక్యభాగములలో, రాజ్యమును ఆవిష్కృతము చేసినప్పుడు క్రీస్తు మన దైవిక రాజరిక యుద్ధశూరునిగా వ్యవహరించాడని క్రొత్త నిబంధన బోధిస్తుంది. అయితే యేసు సాతానును మరియు లోకములోని అబద్ధ దేవతలను జయించుచుండగా, ఆయనకు లోబడు ప్రతిఒక్కరికి ఆయన క్షమాపణను మరియు దేవునితో సమాధానపరచబడుటను కృపతో అనుగ్రహించాడు.

రాజ్యము యొక్క కొనసాగింపులో యేసు మన రాజరిక విజయుడైన యుద్ధవీరునిగా ఉన్నాడని 1 కొరింథీ. 15:25, హెబ్రీ. 1:3 మరియు 1 పేతురు 3:22 వంటి వాక్యభాగములలో మనము నేర్చుకుంటాము. సంఘ చరిత్ర అంతటిలో లోకములో సాతానును మరియు దుష్ట శక్తులను ఓడించు క్రీస్తు ప్రణాళికను మనము అనుకరించువారిగా ఉండాలి. క్రీస్తునందు విశ్వాసము ద్వారా క్షమాపణ మరియు దేవునితో సమాధానపడుటను మనము బోధించుట కొనసాగించాలి.

చివరిగా, 2 థెస్స. 1:6 మరియు 7, హెబ్రీ. 10:27, 2 పేతురు 3:7 వంటి వాక్యభాగములలో, రాజ్యము యొక్క సంపూర్ణతలో క్రీస్తు మరొకసారి దైవికమైన రాజరిక యుద్ధశూరునిగా తిరిగివస్తాడని మనము కనుగొంటాము. అయితే ఆయన తిరిగివచ్చినప్పుడు, క్రీస్తు కృపతో అనుగ్రహించిన సమాధానము ముగించబడుతుంది. క్రీస్తు యొద్దకు వచ్చుటకు నిరాకరించిన ప్రతి ఒక్కరికి సాతాను మరియు వాని అపవాదిశక్తులు అనుభవించు గతే పడుతుంది — దేవుని యొక్క నిత్యమైన తీర్పు.

ఇశ్రాయేలు యొక్క రాజరిక నిబంధనను నెరవేర్చువానిగా మరియు విజయుడైన రాజరిక యుద్ధశూరునిగా దేవునిని గూర్చిన ముఖ్య అంశములను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు నిర్గమకాండములోని మూడవ ప్రధానమైన అంశమును చూడవలసియున్నది: నిర్గమ. 19:1-24:11లో ఇశ్రాయేలుకు రాజరిక నిబంధన ధర్మశాస్త్రమును ఇచ్చినవానిగా దేవుడు.

## నిబంధన ధర్మశాస్త్రమును ఇచ్చినవాడు (19:1-24:11)

ఇంతకు ముందు మనము చూసినట్లు, ఈ వచనములు మోషే అధికారము మరియు ఇశ్రాయేలు యొక్క నిబంధన ధర్మశాస్త్రము వైపుకు దృష్టిని ఆకర్షిస్తాయి. పురాతన పశ్చిమ ఆసియాలో, వారు ఇచ్చిన న్యాయవిధుల ద్వారా మానవ మరియు దైవిక రాజులు తమ జ్ఞానమును బయలుపరచారని ప్రజలు నమ్మేవారు. కాబట్టి, దేవుడు వారికి రాజరిక నిబంధన ధర్మశాస్త్రమును ఇచ్చాడు అను విషయము నిర్గమకాండము యొక్క వాస్తవిక శ్రోతలను ఆశ్చర్యపరచియుండదు. అయితే, మోషే ఈ



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అంశమును ఏ విధంగా ఉద్ఘాటించాడో గుర్తించుటకు, నిర్గమకాండములో దేవుడు తన ధర్మశాస్త్రమును *ఎందుకు* ఇచ్చాడో చూచుట సహాయకరముగా ఉంటుంది.

ధర్మశాస్త్రము యొక్క మూడు ముఖ్యమైన ఉపయోగములను గూర్చి ప్రతి ప్రధానమైన ప్రొటెస్టెంట్ సాంప్రదాయము మాట్లాడుతుంది. మొదటి దానిని చాలా సార్లు "*యుసుస్ పెడగోగికస్,"* అని పిలుస్తారు, అనగా ధర్మశాస్త్రమును బోధన కొరకు ఉపయోగించుట. పాపమును ఎత్తిచూపి, బట్టబయలు చేయుటకు దేవుడు ధర్మశాస్త్రమును ఉపయోగిస్తాడని గలతీ. 3:23-26, రోమా. 3:20, మరియు రోమా. 5:20 మరియు 21 వంటి క్రొత్త నిబంధన వాక్యభాగములు బోధిస్తాయి. ఈ విధంగా మానవులు రక్షణ కొరకు క్రీస్తు వైపుకు ఆకర్షించబడతారు. రెండవదిగా, ప్రొటెస్టెంట్లు "*యుసుస్ సివిలస్*"ను గూర్చి మాట్లాడతారు, అనగా ధర్మశాస్త్రమును పౌర లేక రాజకీయ విషయముల కొరకు ఉపయోగించుట. ఈ ఉపయోగములో, ధర్మశాస్త్రము దేవుని తీర్పును గూర్చి భయమును కలిగించి సమాజములో పాపమును అరికట్టుటకు ప్రయత్నిస్తుంది. అయితే, లేఖన బోధనల విషయములో ఈ దృక్పథములు వాస్తవమైయున్నప్పటికీ, నిర్గమకాండము "ధర్మశాస్త్రము యొక్క మూడవ ఉపయోగము" అని పిలువబడుదానిని ఉద్ఘాటిస్తుంది. దీనిని కొన్నిసార్లు "*యుసుస్ నోర్మటివస్,*" అనగా నిర్దేశక ఉపయోగము, లేక "*యుసుస్ డిడక్టికస్,*" అనగా ఉపదేశ ఉపయోగము అని పిలుస్తారు. ఈ సందర్భములో, దేవుడు ధర్మశాస్త్రము ఆయన కృప క్రింద ఉన్నవారి కొరకు ఒక నిర్దేశము, లేక ఉపదేశము అయ్యున్నది. కాని, నిర్గమకాండములో, తన ప్రజలైన ఇశ్రాయేలీయులను తన ఆశీర్వాదములలోనికి నడిపించుటకు దేవుడు ప్రాథమికముగా ధర్మశాస్త్రమును ఇచ్చాడు.

ఈ అంశము నిర్గమకాండములో అనేక చోట్ల కనిపిస్తుంది. కాని 19:1-24:11లో, ఇశ్రాయేలుతో దేవుడు చేసిన నిబంధన యొక్క ప్రారంభము మొదలుకొని, నిబంధన యొక్క నిర్ధారణ వరకు మరింత స్పష్టముగా కనిపిస్తుంది. నిర్గమ. 19:4లో, దేవుడు ఇశ్రాయేలీయులతో పలికిన మాటలను వినండి:

> నేను ఐగుప్తీయులకు ఏమి చేసితినో, మిమ్మును గద్ద రెక్కలమీద మోసి నా యొద్దకు మిమ్ము నెట్లు చేర్చుకొంటినో మీరు చూచితిరి (నిర్గమ. 19:4).

ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్రమును పొందుటకు ముందే, వారు దేవుని కృపను అనుభవించారని ఇక్కడ మనము చూస్తాము. 5 మరియు 6వ వచనములలో, ధర్మశాస్త్రమునకు ఇశ్రాయేలీయులు విధేయులైయుండాలని, అలా చేయుట ద్వారా స్వామిభక్తికి కలుగు లాభములను వారు పొందుతారని దేవుడు సెలవిచ్చాడు. ఆయన ఇలా సెలవిచ్చాడు:

> కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల మీరు సమస్తదేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్తభూమియు నాదేగదా. మీరు నాకు యాజక రూపకమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందు[రు] (నిర్గమ. 19:5-6)

దేవుని కృపను పొందారు కాబట్టి, ఇశ్రాయేలీయులు ధర్మశాస్త్రమునకు విధేయులుగా ఉంటే వారు దేవుని యొక్క "స్వకీయ సంపాద్యము," "యాజక రూపకమైన రాజ్యము మరియు పరిశుద్ధమైన జనము" అవుతారు. స్పష్టముగా, ఇశ్రాయేలు రక్షణను *సంపాదించుకొనుటకు* దేవుని ధర్మశాస్త్రము



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇవ్వబడలేదు. ధర్మశాస్త్రము ఆయన వారిపై కనికరమును చూపిన తరువాత తన ప్రజలకు ఇచ్చిన బహుమానమైయున్నది.

నిర్గమ. 20:1-17లో ఇదే పద్ధతి ప్రత్యక్షమవుతుంది. 20:2లో, ఇశ్రాయేలు పట్ల తన దయను ప్రకటిస్తూ దేవుడు ఇలా సెలవిస్తూ పది ఆజ్ఞలను ఆరంభించాడు:

> నీ దేవుడనైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని (నిర్గమ. 20:2).

మరొకసారి, ఇశ్రాయేలుకు ధర్మశాస్త్రమును ఇచ్చుటకు ముందే దేవుని కనికరము చూపబడినట్లు మనము చూస్తాము. ఈ ప్రకటన చేసిన తరువాతే ఇశ్రాయేలుకు దేవుడు పది ఆజ్ఞలను ఇచ్చాడు. మరియు, పది ఆజ్ఞలు స్పష్టముగా సెలవిచ్చుచున్నట్లు, ధర్మశాస్త్రమునకు విధేయులైయుండుట ద్వారా ఇశ్రాయేలీయులు ఆశీర్వాదములను పొందుకుంటారు.

> దేవుని ధర్మశాస్త్రము కృపను అదుపు చేస్తుంది మరియు విరోధముగా ఉన్నదని చాలామంది అనుకుంటారు, కాని పాత నిబంధనలో దేవుడు ధర్మశాస్త్రమును ఇచ్చిన విధానమును మనము చూసినప్పుడు, ఆయన ధర్మశాస్త్రమును ఇచ్చిన విధముగా దానిని ఇచ్చుట దేవుడు చేసిన కృపా కార్యముగా ఉన్నదని మనము చూడగలుగుతాము. దేవుడు తన ప్రజలను ఐగుప్తు బానిసత్వము నుండి విమోచించిన తరువాత ఆయన వారికి ధర్మశాస్త్రమునిచ్చాడు. ఆయన వారిని బయటకు నడిపించి వారి తరుపున శక్తిగల కార్యములను చేస్తు, వారిని అరణ్యములోనికి నడిపించి, వారి మధ్యకు దిగివచ్చి, వారి గొప్ప రాజుయైన దేవుని యొక్క ప్రభుత్వములో మరియు రాజత్వములో ఎలా జీవించాలో తెలుపు ఒక ప్రణాళికను వారికి బయలుపరచాడు. కాబట్టి, ధర్మశాస్త్రము దేవుని ప్రజలు దానిని అనుసరించిన తరువాత వారిని విమోచించుటకు ఇవ్వబడినది కాదు. బదులుగా, దేవుడు వారిని ఐగుప్తు నుండి విమోచించిన తరువాత ధర్మశాస్త్రము ఇవ్వబడినది, మరియు గొప్ప రాజుగా దేవుని యొక్క ప్రభుత్వములో ఎలా జీవించాలో, మరియు విమోచించబడిన ప్రజలుగా వారు ఒకరితో ఒకరు ఎలా జీవించాలో ఇది ఆయన ప్రజలకు చూపింది. కాబట్టి, పాత నిబంధనలో ధర్మశాస్త్రమును గూర్చి మీరు చదివిన ప్రతిసారి, దేవుడు కృపతో తన ప్రజల మధ్యకు దిగివచ్చిన నేపథ్యములో అది ఇవ్వబడింది.
>
> — డా. బ్రాండన్ డి. క్రో

నిబంధనను స్థిరపరచిన సమయములో కూడా దేవుడు ఈ క్రమమును కనుపరచాడు. నిర్గమ. 24:1 మరియు 2లో, సీనాయి పర్వతము మీద తనను కలుసుకొనుటకు రమ్మని ఆయన ఇశ్రాయేలు నాయకులను దయతో ఆహ్వానించాడు. 3-8 వచనములలో, ప్రజలు ధర్మశాస్త్రమునకు విధేయులైయుంటామని ప్రమాణము చేశారు. 9-11 వచనములలో, ఇశ్రాయేలు నాయకులు దేవునితో



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

సమాధానపడుట అను ఆశీర్వాదమును వేడుకగా జరుపుకున్నారు, మరియు వాస్తవానికి దేవుని చూశారు.

వాస్తవిక శ్రోతల విషయములో, మునుపటి కాలములో దేవుడిచ్చిన ధర్మశాస్త్రము యొక్క కృపగల మరియు ఉపయోగకరముగా ఉండు స్వభావముపై ఉంచబడిన ఈ ఉద్ఘాటన తమ కాలములో వారు దేవుని ధర్మశాస్త్రమును అనుసరించు విధముగా పురికొల్పింది. ధర్మశాస్త్రము తమ ప్రస్తుత పరిస్థితుల కొరకు మరియు భవిష్యత్తు కొరకు కూడా దేవుడు వారికిచ్చిన బహుమానమైయున్నది.

ఈ విధంగానే, క్రీస్తు అనుచరులముగా, నిర్గమకాండములో దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చిన ఆజ్ఞలను మనము చూసిన ప్రతిసారి, అవి క్రీస్తులో మన కొరకు దేవుడిచ్చిన కృపగల మరియు ఉపయోకరమైన బహుమానముగా తలంచాలి.

ఇప్పుడు, ఆయన రాజ్యము యొక్క ఆవిష్కృతములో మన యుగమునకు మోషే ధర్మశాస్త్రమును అనువర్తించుటకు సహాయము చేయుటకు యేసు, ఆయన అపొస్తలులు మరియు ప్రవక్తలు సంఘమునకు నూతన ప్రత్యక్షతలను ఇచ్చారు. అయితే యేసు మరియు ఆయన అనుచరులు మోషే ధర్మశాస్త్రము యొక్క అధికారమును చిన్నబుచ్చలేదు అని మత్తయి 5:17, రోమా. 8:4 మరియు హెబ్రీ. 8:10 వంటి వాక్యభాగములు స్పష్టము చేస్తాయి. రాజ్యము యొక్క కొనసాగింపులో కూడా ఇదే జరిగినది. నేడు, క్రీస్తు రాలేదు అను విధముగా దేవుని ధర్మశాస్త్రమును అనుసరించుటకు మనము ప్రయత్నించకూడదు. కాని క్రీస్తులో దేవుడిచ్చిన ప్రత్యక్షత వెలుగులో నేడు దానిని మనము అనువర్తించుకోవాలి. మరియు, మనకు తెలిసినట్లుగానే, ఆయన రాజ్యము యొక్క నెరవేర్పులో క్రీస్తు తిరిగివచ్చినప్పుడు, ఆయన ప్రజలు సంపూర్ణముగా శుద్ధిచేయబడతారు. తరువాత మనము నూతన సృష్టిలో మన హృదయముల మీద వ్రాయబడిన దేవుని యొక్క పరిపూర్ణమైన ధర్మశాస్త్రమునకు విధేయులమవుతాము.

ఇశ్రాయేలు యొక్క రాజరిక నిబంధనను నెరవేర్చువానిగా, విజయుడైన రాజరిక యుద్ధశూరునిగా, మరియు రాజరిక నిబంధన ధర్మశాస్త్రమును ఇచ్చువానిగా దేవుని చూచుట ద్వారా నిర్గమకాండములోని ముఖ్య అంశములను మనము చూశాము. చివరిగా, నిర్గమ. 24:12-40:38లో ఉన్న ఇశ్రాయేలు యొక్క ప్రస్తుత యుద్ధశూరునిగా దేవుడు అను అంశమును మనము చూద్దాము.

## ప్రస్తుత యుద్ధశూరుడు (24:12-40:38)

> ఇశ్రాయేలు మీద దేవుని యొక్క రాజత్వమును గూర్చి నిర్గమకాండము ఒక ఆసక్తికరమైన వ్యాఖ్యను చేస్తుంది. ప్రజలు పాత నిబంధనను అధ్యయనం చేసినప్పుడు చాలాసార్లు, వారు ఇశ్రాయేలు మొదటి రాజైన సౌలును గూర్చి ఆలోచన చేస్తారు, మరియు అతడు వారి మొదటి భూలోక రాజైయున్నాడు. అయితే నిర్గమ. 19:5 మరియు 6ను మీరు అధ్యయనం చేసినప్పుడు, అది ఇశ్రాయేలు "యాజకరూపమైన రాజ్యముగా" ఉన్నదని సెలవిస్తుంది. రాజు లేకుండా రాజ్యము ఉండదు కదా, కాబట్టి, నిర్గమ. 19:5-6 ప్రకారం దేవుడు స్వయంగా ఇశ్రాయేలు యొక్క మొదటి రాజైయున్నాడు. పాత నిబంధనలో దేవుడు క్రీస్తుగా శరీరరూపము దాల్చనప్పటికీ, ఆయన రాజుగా తనను తాను

ప్రత్యక్షపరచుకున్నాడు మరియు క్రీస్తులో ఆయన రాజత్వము పగటివేల మేఘము మరియు రాత్రివేల అగ్ని స్తంభము రూపములో వారికి ప్రత్యక్షమైయ్యింది. మందిరము ఇమ్మానుయేలునకు చిహ్నముగా ఉండినది, అనగా "దేవుడు మనకు తోడు." కాబట్టి, దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చిన చిత్రములు మరియు చిహ్నములలో దేవుని రాజత్వము దృశ్యమైనది మరియు వీటి ద్వారా ఆయన క్రీస్తు ద్వారా ఆయన ఇశ్రాయేలు మీద చేసిన స్వయం పరిపాలనను మరియు రాజత్వమును కనుపరచాడు.

— డా. డాన్ కొల్లెట్

దేవుని యొక్క రాజత్వ సన్నిధి అను అంశమును నిర్గమ. 24:12-40:38లో మనము స్పష్టముగా చూస్తాము. నిర్గమకాండము యొక్క ఈ నాల్గవ ముఖ్య విభజన మోషే అధికారము మరియు ఇశ్రాయేలు యొక్క మందిరము మీద దృష్టిపెడుతుంది. మందిరము కొరకు దేవుడు మోషేకు హెచ్చరికలను ఎలా ఇచ్చాడో, సీనాయి పర్వతము యొద్ద ఇశ్రాయేలు ఏ విధంగా విఫలమైయ్యిందో, మరియు మందిరము యొక్క నిర్మాణములో మోషే ఇశ్రాయేలును ఏ విధంగా నడిపించాడో ఈ అధ్యాయములు జ్ఞాపకము చేసుకుంటాయి. ఈ సన్నివేశములలో ప్రతి ఒక్కటి ఆయన ప్రజలతో దేవుని యొక్క సన్నిధిని ఉద్ఘాటించాయి. నిర్గమ. 33:14లో, దేవుడు మోషేకు ఈ విధంగా నిశ్చయతనిచ్చాడు.

> నా సన్నిధి నీకు తోడుగా వచ్చును, నేను నీకు విశ్రాంతి కలుగజేసెద[ను] (నిర్గమ. 33:14).

ఈ వచనములోని "నా సన్నిధి" అనే వ్యక్తీకరణ *פָּנִים*(పనిమ్) అను హెబ్రీ నామవాచకమును అనువదిస్తుంది, మరియు ఇది సాధారణంగా "ముఖము" అని అనువదించబడుతుంది. నిర్గమకాండములో మరియు ఇతర చోట్ల ఉన్న అనేక వాక్యభాగములలో, దేవుని "ముఖము" ఆయన ప్రజలతో ఆయన విశేషమైన, బలమైన, ఆసక్తిని చూపు, దృశ్యమైన సన్నిధిని సూచిస్తుంది.

దేవుడు సర్వవ్యాపి అయినప్పటికీ, బైబిలు అంతటిలో ఆయన తన ప్రజల పట్ల విశేషమైన మార్గములలో శ్రద్ధను చూపుతాడు. నిర్గమకాండములోని ఈ భాగములో, దేవుని సన్నిధి మందిరములో మరియు దాని చుట్టుప్రక్కల నిలిచియుండేది. ఈ పాఠంలో ఇంతకు ముందు మనము ప్రస్తావించినట్లు, మందిరము కేవలం ఒక చాపెల్ లేక ఇశ్రాయేలీయులు ఆరాధన కూటములను జరిపిన స్థలము మాత్రమే కాదు. మందిరము దేవుని రాజరిక యుద్ధ గుడారము కాబట్టి ఇశ్రాయేలీయులు దానిలో దేవుని ఆరాధించారు. పురాతన మానవ రాజులు తమ సైన్యములను యుద్ధమునకు నడిపించినప్పుడు రాజరిక యుద్ధ గుడారములలో నివసించిన విధముగానే, కనానును స్వాధీనపరచుకొనుటకు ఇశ్రాయేలు సైన్యమును నడిపించునప్పుడు దేవుడు తన మందిరములో నివాసము చేశాడు.

ఇప్పుడు, నిర్గమ. 32:1-34:35లో, తన ప్రజల మధ్య దేవుని యొక్క సన్నిధికి ఒక గంభీరమైన ముప్పు ఎదురైయ్యింది. ఈ ఉపాఖ్యానములో, ఇశ్రాయేలు యొక్క వైఫల్యము మరియు సీనాయి పర్వతము యొద్ద పునరుద్ధరణను గూర్చి మనము నేర్చుకుంటాము. ఇశ్రాయేలీయులు సీనాయి యొద్ద బంగారు దూడను ఆరాధించుచున్నారని దేవుడు మొదటిసారి చూసినప్పుడు, మోషే మినహా



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేశమంతటిని సమూలంగా నాశనం చేస్తానని దేవుడు తెలియజేశాడు. అయితే మోషే చేసిన విజ్ఞాపన కారణంగా, దేవుడు శాంతించి కేవలం పాపము చేసినవారిని మాత్రమే శిక్షించాడు. అయినను, వారు ముందుకు కొనసాగుచుండగా తన సన్నిధిని వారి మధ్య నుండి తొలగించుతానని దేవుడు తెలియపరచాడు. అయితే దైవికమైన రాజు యొక్క సన్నిధి లేకుండా ముందుకు కొనసాగాలనే ఆలోచన ఊహించలేనిదిగా ఉన్నది. నిర్గమ. 33:15-16లో మోషే దేవునితో చెప్పిన మాటలను వినండి:

> నీ సన్నిధి రానియెడల ఇక్కడనుండి మమ్మును తోడుకొని పోకుము. నా యెడలను నీ ప్రజలయెడలను నీకు కటాక్షము కలిగినదని దేని వలన తెలియబడును? నీవు మాతో వచ్చుటవలననే గదా? అట్లు మేము, అనగా నేనును నీ ప్రజలును భూమిమీదనున్న సమస్త ప్రజలలోనుండి ప్రత్యేకింపబడుదు[ము] (నిర్గమ. 33:15-16).

"[ఆయన] సన్నిధి [వారితో] రానియెడల" వారిని తోడుకొని పోవద్దని మోషే దేవుని కోరిన విషయమును ఇక్కడ గమనించండి. వారి మధ్య సంబంధము సరిగా ఉన్నదను నిశ్చయతను ఇవ్వమని అతడు కోరాడు. "భూమిమీదనున్న సమస్త ప్రజలలోనుండి [వారిని] ప్రత్యేకించిన" దాని నుండి, అనగా వారితో దేవుని సన్నిధి ఉండుట నుండి వారిని దూరము చేయవద్దని అతడు దేవుని కోరాడు. నిర్గమ. 33:17లో, దేవుడు ఈ విధంగా స్పందించాడు:

> నీవు చెప్పిన మాటచొప్పున చేసెదను; నీమీద నాకు కటాక్షము కలిగినది, నీ పేరునుబట్టి నిన్ను ఎరుగుదు[ను] (నిర్గమ. 33:17).

కాబట్టి ఈ పుస్తకములోని చివరి వచనమైన నిర్గమ 40:38 మందిరము యొద్ద ఇశ్రాయేలుతో దేవుని యొక్క సన్నిధిని ఎత్తిచూపుట ఆశ్చర్యము కలిగించదు.

> ఇశ్రాయేలీయులందరి కన్నుల ఎదుట పగటివేళ యెహోవా మేఘము మందిరము మీద ఉండెను. రాత్రివేళ అగ్ని దానిమీద ఉండెను. వారి సమస్త ప్రయాణములలో ఈలాగుననే జరిగెను (నిర్గమ. 40:38).

> దేవుడు ఆయన ప్రజలతో ఉన్నాడు. పొదలో ఆయన మోషేతో ఉన్నాడు. ఈ మేఘము మరియు అగ్ని స్తంభము ద్వారా ఆయన తన ప్రజలతో ఉండి, రాత్రివేళ అగ్ని ద్వారా మరియు పగటివేళ మేఘము ద్వారా వారిని నడిపించాడు. మరియు ఈ పుస్తకములోని తరువాత అధ్యాయములను, అనగా చాలాసార్లు నిర్లక్ష్యం చేయబడు ఈ పుస్తకములోని భాగములను మనము చూసినప్పుడు, దేవుడు వారికి ఒక గుడారమును, ఒక మందిరమును ఇచ్చాడు. మరియు ఈ మందిరపు గుడారములో ఆయన వారికి దేవుని సన్నిధి చిహ్నాత్మకముగా నివసించిన నిబంధన మందసమును ఇచ్చాడు. దేవుడు తన ప్రజలతో ఉండుటకు ఆశించు దేవుడైయున్నాడు అనునది నాకు చాలా నచ్చిన విషయము, మరియు ఇది యోహాను 1లో మనము చూచుదానికి ముందస్తు సూచనగా ఉన్నది:

> **వాక్యము శరీరధారియై తన ప్రజల మధ్య మందిరమాయెను (యోహాను 1:14, అక్షరార్థ అనువాదం).**
>
> **పాత నిబంధనలో దేవుడు తన ప్రజలతో ఉండగోరాడు, మరియు క్రొత్త నిబంధనలో తన ప్రజలతో ఉండుటకు దేవుడు తన కుమారుడైన యేసును పంపాడు.**
>
> — డా. డేవిడ్. టి. లాంబ్

దేవుని విశేషమైన రాజరిక సన్నిధి అను ఈ ముఖ్యమైన అంశమును క్రొత్త నిబంధన క్రీస్తు అనుచరులకు క్రీస్తు రాజ్యము యొక్క మూడు దశలలోను అనువర్తిస్తుంది. ఆయన రాజ్యము యొక్క ఆవిష్కృతములో, క్రీస్తు స్వయముగా ఆయన ప్రజల మధ్య అసాధారణమైన రాజరిక దేవుని సన్నిధిగా ఉన్నాడని మత్తయి 18:20 మరియు యోహాను 2:19-21 వంటి వాక్యభాగములు వివరిస్తాయి. వాస్తవానికి, యోహాను 1:14 ఇశ్రాయేలు మందిరమునకు మరియు యేసు యొక్క మొదటి రాకడకు మధ్య ఒక స్పష్టమైన అనుబంధమును తెలియజేస్తుంది. ఈ వచనమును వినండి:

> **ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయకుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి (యోహాను 1:14).**

"మనమధ్య నివసించెను" అను వ్యక్తీకరణ *σκηνόω* (స్కెనూ) అను గ్రీకు పదములో నుండి వెలువడుతుంది. గ్రీకు పాత నిబంధన అయిన సెప్టుజెంట్, తన మందిరములో దేవుని సన్నిధిని వివరించుట కొరకు నిర్గమకాండములో ఉపయోగించిన *שָׁכַן* (షకన్) అను అదే హెబ్రీ క్రియాపదమును ఉపయోగిస్తుంది. కాబట్టి, క్రీస్తు నరావతారము దేవుడు ప్రజలతో నివసించి వారిని విజయములోనికి నడిపించుట అయ్యున్నదని ఈ వచనము సూచిస్తుంది.

అంతేగాక, యేసు పరలోకమునకు ఆరోహణమైనప్పుడు, క్రీస్తు అనుచరుల మీద ఆయన తన ఆత్మను కుమ్మరించాడు అని అపొ. 2:17 మరియు రోమా. 5:5 వంటి వాక్యభాగములు బోధిస్తాయి. కాబట్టి, క్రీస్తు రాజ్యము యొక్క కొనసాగింపులో, పరిశుద్ధాత్మ తన సంఘములో నివాసముంటాడు. దేవుడు తన సన్నిధితో మందిరమును నింపిన విధముగానే, ఆత్మ తన ప్రజలకు ప్రతి దినము దేవుని నడిపింపు మరియు విజయము యొక్క నిశ్చయతను కలిగించు ఆయన యొక్క విశేషమైన, బలమైన సన్నిధితో నింపుతాడు.

అవును, క్రీస్తు నరావతారము మరియు ఆత్మ యొక్క సన్నిధి నూతన సృష్టిలో దేవుని రాజరిక సన్నిధి అను అద్భుతమునకు పూర్వగాములుగా ఉన్నాయని ప్రకటన 21:3 వంటి వాక్యభాగములు బోధిస్తాయి. ఆయన రాజ్యము యొక్క నెరవేర్పులో క్రీస్తు తిరిగివచ్చినప్పుడు, ఆయన సమస్తమును నూతనముగా చేస్తాడు. మరియు మన ప్రస్తుత యుద్ధశూరుడైన రాజు యొక్క దృశ్యమైన మహిమతో సర్వసృష్టి నింపబడుతుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# ముగింపు

"నిర్గమకాండము యొక్క అవలోకనము" అను శీర్షిక ఇవ్వబడిన ఈ పాఠంలో, రచయిత, సందర్భము, వాస్తవిక అర్థము మరియు ఆధునిక అనువర్తనము వంటివి మనస్సులో ఉంచుకొనవలసిన కొన్ని ఆరంభ పరిగణలను మనం పరిచయం చేశాము. ఈ గ్రంథమును రెండు ముఖ్యమైన విభాగములుగా విభజించుట ద్వారా నిర్గమకాండము యొక్క నిర్మాణము మరియు విషయములను కూడా మనము విశదీకరించాము. ఈ గ్రంథము అంతట దేవుని రాజత్వములోని అనేక కోణములు ఏ విధంగా ఎత్తి చూపబడినవి అను అంశముతో సహా కొన్ని ముఖ్య అంశములను మనము చూశాము.

వాగ్దాన దేశము యొక్క సరిహద్దున వారు మోషేతో కలసి బసచేయుచుండగా నిర్గమకాండము దాని యొక్క వాస్తవిక ఇశ్రాయేలీయ శ్రోతల కొరకు గొప్ప ప్రాముఖ్యతను కలిగియుండినది. తమ దినములలో దేవుని కొరకు నివసించు సవాళ్లను గూర్చి ఇశ్రాయేలీయులు ఆలోచన చేయుచుండగా, వారి దేశమునకు దేవుడు-అభిషేకించిన నాయకునిగా మోషే పట్ల వారి సమర్పణను పునరుద్ఘాటించమని నిర్గమకాండము వారికి పిలుపునిచ్చింది. ఐగుప్తు నుండి సీనాయి పర్వతము వరకు వారు పొందిన విమోచనలో మోషే పోషించిన పాత్రను అది వారికి జ్ఞాపకము చేసింది. మరియు దేవుడు వారిని వాగ్దాన భూమి కొరకు ఏ విధంగా సిద్ధపరచాడో అది వారికి జ్ఞాపకము చేసింది.

ఇంచుమించు ఇదే విధముగా, నేడు క్రీస్తు అనుచరులముగా, క్రీస్తులో దేవుడు సాధించినదాని వెలుగులో మోషే అధికారము పట్ల మన స్వామిభక్తిని ఉద్ఘాటించమని నిర్గమకాండము మనకు పిలుపునిస్తుంది. ఇశ్రాయేలు యొక్క నాయకునిగా మోషే ద్వారా దేవుడు చేసిన కార్యములను నిర్గమకాండము ఎంతగా ఎత్తి చూపుతుందో, అంత కంటే ఎక్కువగా క్రీస్తు ద్వారా దేవుడు చేసిన కార్యములను అది తెలియపరుస్తుంది. క్రీస్తులో, దేవుడు మనలను పాపపు బానిసత్వము నుండి మరియు సాతాను అధికారమును నుండి నిత్యము వరకు విమోచించాడు. మరియు క్రీస్తులో, దేవుడు మనకు క్రీస్తు ఆత్మ యొక్క సన్నిధిని మరియు మనలను నడిపించుటకు సూచనలను ఇచ్చాడు. దీని వెలుగులో, క్రొత్త ఆకాశము మరియు క్రొత్త భూమిలో మన కొరకు వాగ్దానము చేయబడిన నిత్య స్వాస్థ్యమును పొందుకొనునట్లు మనలను నడిపించుచుండగా క్రీస్తును మనము ఎలా అనుసరించాలో మరి ఎక్కువగా నేర్చుకొనుటకు లెక్కలేనన్ని అవకాశములను నిర్గమకాండము మనకు ఇస్తుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.